

www.epapersamayam.com
APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

S TV SAMAYAM

సంపుటి : 18 | సంచిక : 193 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 22 మార్చి 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5

# వడగళ్లు తెచ్చిన నష్టం

- రాష్ట్రంలో పలుచోట్ల అకాల వర్షా లు
- వరి, మొక్కజొన్న, మామిడి రైతులకు నష్టం
- కుమురం భీం జిల్లాలో గోడ కూలి ఒకరి మృతి

**సమయం న్యూస్, హైదరాబాద్:** రాష్ట్రంలో శుక్రవారం పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో వడగళ్లు కురిసి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. అత్యధికంగా నిర్మల్ జిల్లా ముథోల్‌లో 2 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. నిజామాబాద్, మెదక్, సిద్దిపేట, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసింది. వడగళ్ల వానతో పొట్ట దశలోని ధాన్యపు గింజలు, మామిడి పూత, కాయలు రాలిపోయాయి. మొక్కజొన్న పంట నేలవాలింది. ఇన్నాళ్లూ కంటిరెప్పలా

తరువాయి 2లో



## తక్కువ వడ్డీకి రుణాలివ్వండి



- నాబార్డు చైర్మన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి

**సమయం న్యూస్, హైదరాబాద్:** తెలంగాణకు గ్రామీణ మౌలిక వసతుల నిధి (ఆర్ఐడీఎఫ్) కింద తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వాలని నాబార్డు (జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు) చైర్మన్ కేవీ షాజీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. శాసనసభ ప్రాంగణంలోని కార్యాలయంలో శుక్రవారం సీఎంను షాజీ కలిశారు. ఈ సందర్భంగా జరిగిన భేటీలో సీఎం మాట్లాడుతూ... ''తెలంగాణలో సహకార వ్యవస్థను బలోపేతం చేయాలి. ఈ మేరకు కొత్తగా మరిన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలి. కొత్త గ్రామ పంచాయతీల మధ్య అనుసంధానం పెంచేందుకు చర్యలు చేపట్టాలి. స్వయం సహాయక సంఘాల మహిళా గ్రూపులకు ప్రత్యేక పథకాన్ని రూపొందించాలి. ఇందిరా క్రాంతిపథం,

తరువాయి 2లో



## 'పది' పరీక్షల తొలిరోజే కలకలం

- మంచిర్యాలలో ప్రశ్నపత్రం తారుమారు
- నకిరేకల్‌లో బయటకొచ్చిన ప్రశ్నపత్రం
- ఈ ఘటనలపై విద్యాశాఖ సీరియస్.. బాధ్యులపై చర్యలు
- మొదటి రోజు 99.67 శాతం హాజరు

**సమయం న్యూస్, హైదరాబాద్ నల్గొండ :** రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన తొలిరోజే రెండు ఘటనలు విద్యాశాఖలో కలకలం సృష్టించాయి. మంచిర్యాల పట్టణంలోని ఓ పరీక్షా కేంద్రానికి తెలుగుకు బదులు హిందీ ప్రశ్నపత్రాన్ని తీసుకురావడం నల్గొండ జిల్లా నకిరేకల్‌లో పరీక్ష పూర్తికాకముందే ప్రశ్నపత్రం సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షం కావడాన్ని సీరియస్‌గా పరిగణించిన విద్యాశాఖ విచారణకు ఆదేశించింది. మంచిర్యాల

తరువాయి 2లో



## గాజాను ఆక్రమించమని సైన్యాన్ని ఆదేశించా

- ఇజ్రాయెల్ రక్షణమంత్రి కాట్జ్

టెల్ అవీవ్: గాజా విషయంలో ఇజ్రాయెల్ మరింత దూకుడుగా వ్యవహరిస్తోంది. బందీలను విడిచిపెట్టకపోతే గాజాలోని భూభాగాలను క్రమక్రమంగా ఆక్రమిస్తామని హెచ్చరికలు పంపింది. హమాస్ తలొగ్గితేనే తమ ఆక్రమణ ఆగుతుందని.. అప్పటివరకు సైన్యం మరిన్ని భూభాగాలను ఇజ్రాయెల్‌లో విలీనం చేస్తూనే ఉంటుందని శుక్రవారం ఇజ్రాయెల్ రక్షణమంత్రి కాట్జ్ తెలిపారు. ''బందీలను హమాస్ విడిచిపెట్టకపోతే

తరువాయి 2లో



## లోకో పైలట్లు కూల్‌డ్రింక్స్ తాగవచ్చా?.. రైల్వేశాఖ ఏమన్నదంటే!

* ఒడెసా నగరంలో భారీగా మంటలు

కీవ్: ఉక్రెయిన్‌లోని నల్లసముద్రం తీరంలోని ఒడెసా నగరంపై రష్యా భారీస్థాయిలో డ్రోన్లతో విరుచుకుపడింది. ముగ్గురు పౌరులకు గాయాలయ్యాయి. నగరంలో చాలా చోట్ల మంటలు చెలరేగాయి. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం కూడా నిలిచిపోయిందని స్థానిక అధికారులు తెలిపారు. ఉక్రెయిన్‌లోని ఇంధన కేంద్రాలపై దాడులను తాత్కాలికంగా నిలిపివేస్తామని ఇటీవల ట్రంప్‌తో జరిగిన చర్చల్లో

తరువాయి 2లో

## నూతన కోర్టు భవనాల నిర్మాణాలకు రూ.1000 కోట్లు

* అడ్వొకేట్లు, వారి కుటుంబ సభ్యులకు హెల్త్‌కార్డులు
* మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



**సమయం న్యూస్, హైదరాబాద్:** రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన 13 జిల్లాల్లో నూతన కోర్టు భవ నాల నిర్మాణాలకు రూ.1000 కోట్ల నిధులు మంజూరయ్యాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. 'అడ్వొకేట్‌లు, గుమాస్తాల సంక్షేమ చట్టం సవరణ బిల్లు 2025'ను శుక్రవారం మండలిలో ప్రవేశపెట్టిన సందర్భంగా సభ్యులు ప్రస్తావించిన అంశాలపై ఆయన వివరణ ఇచ్చారు. నూతన హైకోర్టు భవన నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి 100 ఎకరాలను కేటాయించారన్నారు. ''నూతన హైకోర్టు, న్యాయమూర్తుల నివాస సముదాయాల నిర్మాణానికి రూ.2600 కోట్లు వెచ్చిస్తున్నాం. రాష్ట్రంలోని అడ్వొకేట్లు, వారి కుటుంబసభ్యులతో కలిపి మొత్తం

తరువాయి 2లో

## ఏడుకొండల పరిధిలో వాణిజ్య కార్యకలాపాలకు వీల్లేదు

- అందుకే ముంతాజ్ హోటల్‌కు భూకేటాయింపులు, అనుమతుల రద్దు
- మానవ సేవకు అన్నదానం, ప్రాణదానం.. మాధవ సేవకు ఆలయాల నిర్మాణం
- ఆలయాల పవిత్రతకు అధిక ప్రాధాన్యం
- తిరుమలలో సీఎం చంద్రబాబు



**సమయం న్యూస్, తిరుపతి:** 'మానవ సేవలో భాగంగా దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తిరుమలలో అన్నదానం ప్రారంభిస్తే, తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో నేను ప్రాణదాన కార్యక్రమం ప్రవేశపెట్టాను. మాధవ సేవకుగానూ ఇప్పుడు ఆలయాల నిర్మాణానికి సంకల్పం తీసుకున్నామ'ని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. గ్రామాల్లో గుడులు నిర్మించాలని అనేక వినతులు వస్తున్నాయని, ఇందుకోసం 'వేంకటేశ్వర స్వామి ఆలయాల నిర్మాణనిధి' పేరుతో ట్రస్టు ఏర్పాటు చేస్తామన్నారు. ఇంకా ఏదైనా మంచి పేరుంటే పెట్టాలని

తరువాయి 2లో



## ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతున్నాం

* హామీలను పక్కాగా అమలు చేస్తున్నాం
* పదేళ్లలో భారాస ప్రభుత్వ ఖర్చు రూ.16.70 లక్షల కోట్లు
* అంత సొమ్ము వెచ్చించి నాగార్జునసాగర్, ఓఆర్ఆర్, విమానాశ్రయం వంటివి నిర్మించారా?

2లో

## బలభద్రపురాన్ని వణికిస్తున్న క్యాన్సర్

* గడిచిన రెండేళ్లలో వేగంగా విజృంభణ
* చాలా కుటుంబాల్లో రోగులు.. మృతులూ ఎక్కువే
* జల, వాయు కాలుష్యమే కారణమంటున్న స్థానికులు



2లో

www.epapersamayam.com APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక · తెలుగు దినపత్రిక



# ఏడుకొండల పరిధిలో వాణిజ్య కార్యకలాపాలకు వీల్లేదు

(మొదటిపేజీ తరువాయి)

తితిదే అధికారులకు సూచించారు. శ్రీవాణి ట్రస్టు నిధులతోపాటు భక్తులిచ్చే విరాళాలతో పకడ్బం దీగా ఆలయాల నిర్మాణం చేపడతామని సీఎం స్పష్టంచేశారు. వాటి నిర్వ హణ బాధ్యతలు స్థానికులకే అప్పగిస్తామన్నారు. మనవడు దేవాంశ్ పుట్టినరోజు సందర్భంగా గురువారం తిరుమల శ్రీవారిని దర్శిం చుకున్న అనంతరం శ్రీపద్మావతి అతిథిగృహంలో సీఎం చంద్రబాబు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, ఏఈవో వెంకయ్యచౌదరి, పాలక మండలి సభ్యులు, అధికారులతో సమీక్షించారు. అక్కడే విలేకరుల సమావేశంలో కీలక నిర్ణయాలు వెల్లడించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

**అపవిత్రం చేయొద్దు**

ఏడుకొండలు వేంకటేశ్వరస్వామి సొంతం. వీటిని ఆనుకుని ఉన్న ప్రాంతంలో ఒబెరాయ్ గ్రూప్‌నకు చెందిన ముంతాజ్ హోటల్‌కు 20 ఎకరాలు వైకాపా హయాంలో కేటాయించి, నిర్మాణానికి అనుమతులిచ్చారు. దీన్ని రద్దు చేస్తున్నాం. వైష్ణవి వెర్సటైల్ వెంచర్ (దేవలోక్)కు 10.32 ఎకరాలు, ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన మరో 5 ఎకరాలూ రద్దు చేయాలని నిర్ణయించాం. ఏడుకొండలను ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని అపవిత్రం చేయడానికి, అక్కడ వాణిజ్య కార్యకలాపాలకు వీల్లేదు.



ఒబెరాయ్ హోటల్ యాజమాన్యానికి ఇదే చెప్పా. ప్రత్యామ్నాయంగా మరో చోట భూమి ఇస్తామని మేం చేసిన ప్రతిపాదనకు వారు అంగీకరించారు.

**విదేశాల్లోనూ ఆలయాలు నిర్మిస్తాం**

దేశంలో అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు కట్టాలని సంకల్పం తీసుకున్నా. ముఖ్యమంత్రులందరికీ లేఖ రాస్తా. వారు ముందుకొస్తే, అక్కడ గుడులు కట్టే బాధ్యతను తితిదే తీసుకుంటుంది. విదేశాల్లోనూ హిందువులు ఎక్కువ సంఖ్యలో ఉన్నచోట శ్రీవారి ఆలయాలు నిర్మిస్తాం. అమరావతిలో ఇటీవల కల్యాణ మహోత్సవం నిర్వహించాక, ఓ కొత్త శక్తి, శోభ, నమ్మకం వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌కు వేంకటేశ్వరస్వామి, కూచిపూడి, అరకు కాఫీ వారసత్వ సంపదలు. ఈ మూడింటినీ ప్రోత్సహిస్తున్నాం. దేశంలో, ప్రపంచంలో ఉన్న శ్రీవారి ఆస్తులు కాపాడాలని కంకణం కట్టుకున్నా. హథీరాంజీ మఠమే కాదు, స్వామివారి ఆస్తులు ఏవి కబ్జాచేసినా, మళ్లీ అవి దేవుడికే చెందేలా చర్యలు తీసుకుంటాం. తిరుమలలో హిందువులే పనిచేయాలి. అదేవిధంగా క్రైస్తవ, ముస్లిం ప్రార్థనా మందిరాల్లో హిందువులు పని చేయకూడదని ఉంటే వారి మనోభావాల ప్రకారం నడుచుకుంటాం. అక్కడ హిందువులు విధులు నిర్వర్తించకుండా చూస్తా.

**వ్యక్తిగత ప్రయోజనాలొద్దు**

గతంలో అసెంబ్లీలో 'ఏడుకొండలు లేవు. ఐదు కొండలే ఉన్నాయి' అని కొందరన్నారు. దీనిపై అప్పట్లో పోరాడా. మొక్కు తీర్చుకునేందుకు పాదయాత్రగా వచ్చా. సమాజాన్ని ప్రభావితం చేసే వ్యక్తులు మౌనంగా ఉంటే, చాలా నష్టం జరుగుతుంది. అలిపిరిలో దాడి ఘటన నుంచి స్వామివారే నన్ను కాపాడారు. తితిదే ఉద్యోగులు, ఆలయ నిర్వాహకులు, బోర్డు సభ్యులు.. ఎవరైనా తిరుమల పవిత్రతను కాపాడడానికి వీలైతే ఓ అడుగు ముందుకేయాలి. లేదంటే కనీసం వారి పని వారు చేసినా చాలు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం పని చేయకూడదు. అపచారం, అపవిత్రం అసలే చేయొద్దు. గత ఐదేళ్లూ తిరుమల పవిత్రతను కాపాడేందుకు ఎన్నో పోరాటాలు చేసినా, నాటి పాలకులు పట్టించుకోలేదు. నేను సీఎంగా బాధ్యతలు చేపట్టాక, రాష్ట్రాన్ని పునర్నిర్మించడంలో భాగంగా తిరుమల నుంచే ప్రక్షాళన చేస్తానని చెప్పా. ఈవోగా శ్యామలరావును నియమించా. కొన్ని తప్పిదాలను ఆయన సరిదిద్దారు. ఇంకా చిన్నచిన్న పనులు మిగాలియి. వాటినీ చేస్తాం.

*** ఆలయం మూసేస్తానంటే కోప్పడ్డా**

తిరుపతిలో నీటిఎద్దడి తలెత్తితే తెలుగు గంగ నీళ్లు నేనే తీసుకొచ్చా. తిరుమలలో ఓ సీజన్‌లో నీరు లేదు. రోజూ ఐదారు వందల ట్యాంకర్లు తిరుపతి నుంచి కొండపైకి తీసుకురావడం కష్టంగా ఉందని అధికారులు చెప్పారు. మూణ్నెల్ల పాటు ఆలయం మూసేస్తామంటే కోప్పడ్డా. 90 95 రోజుల్లో కల్యాణి డ్యాం నుంచి ఎల్‌అండ్‌టీ సంస్థతో నీటి సరఫరా పనులు పూర్తిచేయించా. ఆలస్యమైతే అరెస్టు చేయిస్తానని హెచ్చరించా. వేంకటేశ్వరస్వామి ఆలయం మూసివేసి ఉంటే చరిత్రలో రాయాల్సి వచ్చేది. ఆలయాల నిర్వహణకు సంబంధించి మన రాష్ట్రంలో మంచివ్యవస్థ ఉంది. స్వయం ప్రతిపత్తి కన్నా గుడుల అభివృద్ధికి చేయాల్సినవన్నీ చేస్తాం. డిప్యూటేషన్‌పై వచ్చి తితిదేలో తిష్ఠవేసిన అధికారులతోపాటు నిర్ణయాల్లో లోపాలుంటే త్వరలో సమీక్షించి సరిచేస్తాం. కొండపై పచ్చదనాన్ని 68% నుంచి 90 శాతానికి తీసుకెళ్లాలని ఆదేశించా. శ్రీవాణి ట్రస్టుకు పన్ను మినహాయింపును కొనసాగిస్తాం. అందులో వచ్చే డబ్బులు దేవాలయాల నిర్మాణానికి వినియోగిస్తాం. గత ఐదేళ్లలో జరిగిన అరాచకాలపై విజిలెన్స్ విచారణ జరిగింది. ఇది ప్రభుత్వ అంతర్గత వ్యవహారం.

# బలభద్రపురాన్ని వణికిస్తున్న క్యాన్సర్

(మొదటిపేజీ తరువాయి)

'నేను మూడేళ్లుగా బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాను. నా భర్త రాజు నాకు సేవలు చేసేవారు. రెండేళ్ల క్రితం ఆయనకూ క్యాన్సర్ నిర్ధారణైంది. తర్వాత ఆరు నెలల్లోనే చనిపోయారు. ఆయన చికిత్స కోసం దాదాపు రూ.4.5 లక్షలు ఖర్చు పెట్టినా ప్రాణాలు దక్కలేదు. క్యాన్సర్ మహమ్మారి వల్ల మా కుటుంబం దిక్కులేనిదైంది' అని తాతపూడి ముసలమ్మ కన్నీరుమున్నీరయ్యారు. ఇది ఆ ఒక్క అభాగ్యురాలి వ్యథ మాత్రమే కాదు. ఆ గ్రామంలో ఏ వీధిలోకి వెళ్లినా ఇలాంటి కన్నీటి కథలే. క్యాన్సర్ భూతం కోరల్లో చిక్కి ఛిద్రమైన కుటుంబాల వేదనే. ప్రకృతి సౌందర్యానికి నెలవైన తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజక వర్గంలోని బిక్కవోలు మండలంలో చుట్టూ పచ్చని పొలాల మధ్య ప్రశాంతతకు మారు పేరుగా ఉండే బలభద్రపురం గ్రామంలో క్యాన్సర్ మహమ్మారి విలయతాండవం చేస్తోంది. రెండేళ్లుగా వేగంగా విస్తరిస్తూ ప్రజల ప్రాణాలు హరిస్తోంది. సుమారు 14 వేల జనాభా ఉండే ఈ గ్రామంలో ఏ వీధిలోకి వెళ్లినా క్యాన్సర్ బాధితులు కనిపిస్తున్నారు. కొన్ని కుటుంబాల్లో ఒకరి కంటే ఎక్కువ క్యాన్సర్ రోగులు ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి గురువారం ఈ అంశాన్ని శాసనసభలో ప్రస్తావించడంతో రాష్ట్రవ్యాప్తంగా చర్చలోకి వచ్చింది.

# ఉక్రెయిన్‌పై రష్యా డ్రోన్ దాడులు

(మొదటిపేజీ తరువాయి)

పుతిన్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఉక్రెయిన్ మాత్రం మాస్కో దాడులు కొనసాగుతూనే ఉన్నాయని ఆరోపించింది. ఉక్రెయిన్‌లోని అణు విద్యుత్కేంద్రాలను అమెరికా స్వాధీనం చేసుకోనుందంటూ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కీవ్ వర్గాలు స్పందించాయి. ట్రంప్‌తో చర్చల్లో కేవలం జపోరిజియా అణుకేంద్రం ప్రస్తావనకు మాత్రమే వచ్చిందని వివరణ ఇచ్చాయి. జపోరిజియాపై అమెరికా యాజమాన్యం విషయంలో తాను ట్రంప్‌తో మాట్లాడినట్లు జరిగిన ప్రచారాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఖండించారు. ప్రస్తుత పరిస్థితికి పరిష్కారం ఎలా అనే అంశాన్ని.. రష్యన్ల నుంచి విద్యుత్కేంద్రాన్ని ఎలా తిరిగి తీసుకోవాలనే అంశాలను మాత్రమే చర్చించామన్నారు. అంతేకాదు.. తమ దేశ ఆస్తుల గురించి ట్రంప్‌తో ఏమాత్రం చర్చించలేదన్నారు. ప్రస్తుతం జపోరిజియా రష్యా అధీనంలో ఉన్నా.. ఉక్రెయిన్ పవర్‌గ్రిడ్‌కు అనుసంధానమై ఉంది. దీనినుంచి ఎటువంటి విద్యుత్తు ఉత్పత్తి కావడంలేదు. 2022లో ఉక్రెయిన్‌పై దాడి చేసిన తొలినాళ్లలోనే రష్యా సేనలు దీనిని ఆక్రమించాయి.

# ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతున్నాం

*** దొడ్డిదారిన భూములను విక్రయించారు**

*** బడ్జెట్‌పై చర్చలో విపక్షాల ఆరోపణలకు భట్టి సమాధానం**

హైదరాబాద్: పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన భారాస సర్కారు ప్రభుత్వ వ్యవస్థలను విధ్వంసం చేసిందని ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పదేళ్లలో రూ.16.70 లక్షల కోట్లు ఖర్చు చేసిందని.. అయినా ఒక్క నాగార్జునసాగర్, శ్రీశైలం, విమానాశ్రయం, ఓఆర్ఆర్ అయినా నిర్మించిందా అని ప్రశ్నించారు. శుక్రవారం అసెంబ్లీ, మండలిలో బడ్జెట్‌పై చర్చలో భాగంగా విపక్ష నాయకులు లేవనెత్తిన విమర్శలకు ప్రభుత్వం తరఫున భట్టి సమాధానమిచ్చారు. అంతకు ముందు కాంగ్రెస్ నాయకులకు బుద్ధిమాంద్యం అంటూ భారాస సభ్యుడు హరీశ్ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గాలిలో మేడలు కట్టడం లేదని., అస్తవ్యస్తమైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తాము గాడిన పెడుతున్నామని, అన్నివర్గాల ప్రజల కోసం ప్రతిపైసా వెచ్చిస్తున్నామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. "రాష్ట్రంలో 2014 నుంచి 2023 నవంబరు వరకు భారాస పరిపాలన సాగింది. ఈ మధ్యకాలంలో రూ. లక్షల కోట్ల ఖర్చులు చూపించినా.. ఇంకా రూ. లక్షల కోట్ల బకాయిలు పెట్టారు. మరి భారాస ప్రభుత్వం ఈ రాష్ట్రానికి ఏం సాధించింది? కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినా.. కనిపించకుండా చేసింది. పైగా 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మీరేం చేశారని తిరిగి ప్రశ్నిస్తున్నారు.

*** అంచనాలకు, వాస్తవాలకు పొంతన లేదు**

భారాస ప్రభుత్వం పదేళ్ల బడ్జెట్‌లలో అంచనాలకు.. వాస్తవాలకు పొంతనలేదు. ఓఆర్ఆర్‌ను రూ.7,232 కోట్లకు 30 ఏళ్లకు లీజుకిచ్చారు. ఆబ్కారీ శాఖలో వచ్చే ఏడాదికి సంబంధించిన రూ.58,598 కోట్లు ముందే తీసుకున్నారు. 2014 నుంచి 2023..24 మధ్య భారాస ప్రభుత్వం అడ్డగోలుగా బడ్జెట్ పెంచుకుంటూ పోయింది. గత పదేళ్లలో గ్యాప్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన భారాస సగటున ఏటా 18 శాతం ఖర్చు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యాప్ నిధులపై ఆలోచన చేసి 0.3 శాతం బడ్జెట్ మాత్రమే పెంచింది. 2025 26కు గత బడ్జెట్ కన్నా 4.7 శాతమే మేం పెంచాం. భారాసలా చేసినట్లయితే బడ్జెట్ రూ.4.18 లక్షల కోట్లు అయ్యేది. చేసేదే చెబుదామని, చెప్పిందే చేద్దామని సీఎం సూచించారు. గతప్రభుత్వం 2023 24లో 8.4 శాతం జీఎస్టీ వృద్ధిరేటు నమోదు చేయగా.. ఈ ఏడాది జనవరి వరకు 12.3 శాతం నమోదైంది. కేంద్రం సగటు 11.3 శాతం.. అంటే మనరాష్ట్రమే ఒకశాతం మెరుగ్గా ఉంది. 2014 నుంచి 2020 మధ్య శాసనసభ ఆమోదం లేకుండా భారాస ప్రభుత్వం రూ.2.89 లక్షల కోట్లు ఖర్చు చేసిందని కాగ్ తేల్చింది. గత ప్రభుత్వం పదేళ్లలో చేసిన రుణమాఫీ రూ.28,053 కోట్లు మాత్రమే. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 4 నెలల్లోనే రూ.27,000 కోట్లు రుణాలు మాఫీ చేసింది. గత ప్రభుత్వం రోజుకు 30 వేల టన్నుల ఇసుక అమ్మింది. అప్పట్లో రోజుకు కోటిన్నర ఆదాయం వచ్చింది. ఇప్పుడు అదే ఇసుక విక్రయంతో రోజుకు రూ.3 కోట్లు వస్తోంది. అంటే గతంలో ఏడాదికి రూ.600 కోట్లు పక్కదారి పట్టింది. ఇసుక మాఫియా మాదిరిగానే క్రషర్లు, క్వారీలు ఇతర మాఫియాలకు అడ్డుకట్ట వేస్తాం.

**అప్పుల భారం**

భారాస ప్రభుత్వ హయాంలో రూ.6,69,257 కోట్ల మేర అప్పు చేసింది. మా ప్రభుత్వం వచ్చాక రూ.1,58,041 కోట్ల అప్పులు తెచ్చాం. అందులో రూ.1,53,369 వడ్డీలకు సరిపోగా మిగిలిన సొమ్ము రాష్ట్రావసరాలకు వినియోగించాం. యువత కోసం రాజీవ్ యువవికాసాన్ని అమలు చేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు ఈబీసీలకు దానిని వర్తింపజేస్తున్నాం. బ్రాహ్మణ పరిషత్ బడ్జెట్‌కు అదనంగా రూ.50 కోట్లు పెంచాం. వైశ్య కార్పొరేషన్‌కు రూ.23 కోట్లు ఇచ్చాం.

**ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం**

భారాస పాలనలో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగింది. పదేళ్లలో రూ.70,475 కోట్ల నిధులు వినియోగం కాలేదు. 38.7 శాతం నిధులను వారు వదిలేస్తే.. మేం వాటిని వినియోగించేందుకు చర్యలు చేపట్టాం. గిరివికాసం ద్వారా దళితులను ప్రోత్సహిస్తున్నాం. ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వందశాతం వినియోగిస్తాం. నిర్లక్ష్యానికి గురైన ఐకేపీ పథకాన్ని దారిలో పెడుతున్నాం. 'మహిళాశక్తి' ద్వారా అతివలను ప్రోత్సహిస్తున్నాం. అయిదేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు లక్ష్యం. అందులో ఈఏడాది రూ.20 వేల కోట్లకు.. రూ.21 వేల కోట్లు రుణసాయం అందింది. ఇంకా మంచి పథకముంటే చెప్పండి అమలు చేస్తాం. ఇంటికో ఉద్యోగం చెప్పి గత ప్రభుత్వం మోసం చేసింది. మేం వచ్చాక పబ్లిక్ సర్వీసు కమిషన్‌ను ప్రక్షాళన చేసి 57,946 ఉద్యోగాలను భర్తీ చేశాం. గత సర్కారు వైఫల్యం వల్ల రాష్ట్రానికి కృష్ణా, గోదావరి జలాలు అందని పరిస్థితి ఏర్పడింది. 11 టీఎంసీల కృష్ణా నీరు తెలంగాణకు రాకుండా ఆంధ్రాకు పోతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడం వల్ల గోదావరి నీరు రావడం లేదు. భారాస ప్రభుత్వ హయాంలో లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించకుండా పోయింది. వారంతా బిడ్డల పెళ్లిళ్లు, చదువుల కోసం క్రమబద్ధీకరించాలని కోరితే 25 శాతం రాయితీతో పారదర్శకంగా ఎల్‌ఆర్‌ఎస్‌ను అమలు చేస్తున్నాం. ప్రభుత్వ భూములను అమ్మడంలేదు. గత ప్రభుత్వం ఒక్క గురుకులాన్నీ నిర్మించకుండా.. అద్దెభవనాల్లో, కోళ్లఫారాల్లో కొనసాగించింది. మేం 58 సమీకృత గురుకులాలను నిర్మిస్తున్నాం. విద్యార్థులకు డైట్, కాస్మెటిక్ ఛార్జీలు పెంచాం. ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను పెంచుతున్నాం. బోధనారుసుం విడుదల చేశాం" అని భట్టి తెలిపారు.

# వడగళ్లు తెచ్చిన నష్టం

(మొదటిపేజీ తరువాయి)

కాపాడుకున్న పంట పది నిమిషాల్లో నేలపాలైందంటూ రైతులు కన్నీరుమున్నీరయ్యారు. కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని నౌగాంబస్తీలో ఇంటి గోడ కూలి చందెకర్ దౌలత్(79) అనే వ్యక్తి మృతిచెందారు. మరోవైపు అప్పటి దాకా మండుటెండలో అల్లాడిన ప్రజలు ఒక్కసారిగా కురిసిన వర్షాలతో చల్లదనాన్ని ఆస్వాదించారు. ఉపరితల ఆవర్తన ప్రభావంతో శుక్రవారం ఉదయం నుంచి హైదరాబాద్ నగరంలో గాలులు వీచాయి. మధ్యాహ్నం తర్వాత వాతావరణం మేఘావృతమైంది. దీంతో గరిష్ఠ ఉష్ణోగ్రత 35.8 డిగ్రీలకు తగ్గడంతో జనం ఎండ నుంచి ఉపశమనం పొందారు. రాష్ట్రంలో అన్నిచోట్లా సాధారణం కన్నా దిగువకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. శని, ఆది, సోమవారాల్లోనూ పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయని సూచించింది. గాలి వేగం గంటకు 30 40 కి.మీ. ఉండే అవకాశం ఉందని వెల్లడించింది.

# 'పది' పరీక్షల తొలిరోజే కలకలం

(మొదటిపేజీ తరువాయి)

ఘటనకు సంబంధించి పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్), డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్(డీఓ)ను సస్పెండ్ చేయగా నల్గొండలో ఇద్దరిని రిలీవ్ చేయగా ఒకరిని సస్పెండ్ చేశారు. వరంగల్ జిల్లాలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు కృష్ణారావు ప్రకటించారు. శుక్రవారం ప్రథమ భాష(తెలుగు, ఉర్దూ తదితర)కు రెగ్యులర్ విద్యార్థులు 4,96,549 మందికి 4,94,887 మంది(99.67 శాతం) హాజరయ్యారు. రెండు గంటలు ఆలస్యంగా..: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో 240 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 9.30 గంటలు దాటినా ప్రశ్నపత్రం ఇవ్వలేదు. పోలీసుస్టేషన్ నుంచి తెలుగుకు బదులు హిందీ ప్రశ్నపత్రం రావడంతో కేంద్రం అధికారులు కంగారుపడ్డారు. చీఫ్ సూపరింటెండెంట్ సఫ్దర్‌అలీఖాన్, డీఈవో యాదయ్య సమాచారంతో కలెక్టర్ కుమార్ దీపక్ పరీక్ష కేంద్రానికి చేరుకొని ఉన్నతాధికారులకు తెలియజేశారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తిరిగి సరైన ప్రశ్నపత్రాలు తీసుకొచ్చి 11.30 గంటలకు పరీక్ష ప్రారంభించి మధ్యాహ్నం 2.30 గంటల వరకు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నపత్రాలు భద్రపరిచే పెట్టెలో మొదటి రోజుకు సంబంధించి తెలుగుకు బదులుగా రెండో రోజుకు సంబంధించి హిందీ ప్రశ్నపత్రాన్ని ఉంచారన్నారు. సదరు ప్రశ్నపత్రం కట్టను తెరవకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. నకిరేకల్‌లో ఉదయం 10 గంటల ప్రాంతంలోనే వాట్సప్‌లో ప్రశ్నపత్రం ప్రత్యక్షమైంది. జవాబు నకలు చీటీలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. జిల్లా అధికారుల ఫోన్లకు కూడా ఇవి చేరడంతో వారు నకిరేకల్‌కు వెళ్లి విచారణ చేపట్టారు. ప్రశ్నపత్రం పేజీలపై ముద్రించిన కోడ్ నంబర్‌ను సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రం నుంచి ఇవి బయటకు వచ్చినట్లు గుర్తించారు. పరీక్ష కేంద్రం అధికారులను నల్గొండలోని ఓ ప్రదేశంలో రహస్యంగా విచారించారు.

# నూతన కోర్టు భవనాల నిర్మాణాలకు రూ.1000 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

55,000 మందికి రూ.2లక్షల పరిమితితో హెల్త్‌కార్డులు జారీ చేస్తున్నాం. రూ.10 లక్షల ప్రమాద బీమా కూడా కల్పిస్తున్నాం. న్యాయవాదుల భద్రత కోసం చట్టాన్ని తీసుకొస్తాం. వామనరావు దంపతుల దారుణహత్య ఘటన.. న్యాయవాదులకు రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతోంది'' అని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. అసెంబ్లీలో చర్చలో భాగంగా భారాస ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమ నిధికి భారాస హయాంలో రూ.100 కోట్ల నిధిని ఏర్పాటు చేశామని.. ప్రస్తుత ప్రభుత్వం మరో రూ.100 కోట్లు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ భారాస ప్రభుత్వ హయాంలో ఇద్దరు న్యాయవాదులు హత్యకు గురయ్యారన్నారు. ఆ ఘటనతో ప్రమేయం ఉన్న వ్యక్తిని అసెంబ్లీ ఎన్నికల్లో భారాస పోటీ చేయించిందంటూ తప్పుబట్టారు. దీనిపై ప్రశాంత్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. సభాపతి ప్రసాద్‌కుమార్ స్పందించి రికార్డుల్ని పరిశీలించి తొలగిస్తామన్నారు. ఈ బిల్లు సవరణతో జూనియర్ న్యాయవాదులపై ఆర్థిక భారం తగ్గించాలని భారాస ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ విజ్ఞప్తిచేశారు. చర్చ అనంతరం ఈ రెండు బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపింది.

# తక్కువ వడ్డీకి రుణాలివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

గోదాములు, రైస్‌మిల్లులను నాబార్డుకు అనుసంధానం చేసి రాష్ట్రంలో మిల్లింగ్ సామర్థ్యం పెంచేందుకు సహకరించాలి. స్వయం సహాయక మహిళా సంఘాలు ఏర్పాటు చేస్తున్న సౌరవిద్యుత్ ప్లాంట్ల నిర్వహణలో నాబార్డు భాగస్వామిగా చేరాలి'' అని కేవీ షాజీని కోరారు. 202425 ఆర్థిక సంవత్సరంలో మంజూరైన నాబార్డు నిధులను ఈ నెల 31లోగా ఉపయోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. కొత్త జిల్లాలన్నింటిలోనూ డీసీసీబీలు ఏర్పాటు చేయాలని షాజీ సీఎంను కోరారు. సమావేశంలో నాబార్డు ఏజీఎం ఉదయ్‌భాస్కర్, వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఆదర్శ రైతుల నియామకానికి వినతి**

రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి గ్రామాల్లో ఆదర్శ రైతు వ్యవస్థను, గ్రామీణ సాగునీటి పర్యవేక్షణ కోసం నీటి సంఘాలను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి కోరారు. శుక్రవారం శాసనసభ ప్రాంగణంలో ఆయన తమ సభ్యులతో సీఎంను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.

**ముఖ్యమంత్రికి బీసీ కమిషన్ కృతజ్ఞతలు**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో బీసీ కమిషన్ శుక్రవారం ఆయన కార్యాలయంలో సమావేశమైంది. ఈ సందర్భంగా కమిషన్ ఛైర్మన్ నిరంజన్, సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మి... సీఎంను సత్కరించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో, విద్య, ఉద్యోగ రంగాల్లో 42% రిజర్వేషన్ల బిల్లును ఉభయసభల్లో ప్రవేశ పెట్టి, ఆమోదించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంటులోనూ దీని ఆమోదానికి చొరవ తీసుకోవాలని విన్నవించారు. అనంతరం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లను సైతం బీసీ కమిషన్ వారి కార్యాలయాల్లో సన్మానించింది.

# గాజాను ఆక్రమించమని సైన్యాన్ని ఆదేశించా

(మొదటిపేజీ తరువాయి)

మరిన్ని ప్రాంతాలను ఆక్రమించాలని సైన్యాన్ని ఆదేశించాను. హమాస్ జాప్యం చేస్తున్న కొద్దీ.. మరిన్ని భూభాగాలను ఇజ్రాయెల్‌లో కలుపుకుంటాం'' అని కాట్జ్ తెలిపారు. ఇజ్రాయెల్ తీరును ఫ్రాన్స్ తప్పుబట్టింది. గాజా లేదా వెస్ట్‌బ్యాంక్‌లోని భూభాగాలను ఆక్రమించుకోవడానికి తమ దేశం వ్యతిరేకమని తెలిపింది. "ఈ విషయంలో మేం చాలా స్పష్టంగా ఉన్నాం. సమస్యకు ద్విదేశ పరిష్కారమే మార్గం. రెండు దేశాలు ఒకదానిపక్కన ఒకటి శాంతితో నివసించాలి'' అని ఫ్రాన్స్ విదేశాంగమంత్రి జీన్ నోయెల్ బారెట్ తెలిపారు.

**అంతర్గత నిఘా విభాగాధిపతిపై నెతన్యాహు వేటు**

ఇజ్రాయెల్ అంతర్గత నిఘా విభాగం షిన్‌బెట్ అధిపతి రొనెన్ బార్‌పై శుక్రవారం ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వేటు వేశారు.



## పదవ తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ మార్చి21 (సమయం న్యూస్) :** నేటి నుంచి ప్రారంభం అయిన పదవ తరగతి బోర్డు పరీక్షలకు సంబంధించి జిల్లా కేంద్రంలోని రవి హైస్కూల్, సోన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలోని పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీ.సీ కెమెరా నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా? నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా? లేదా? అని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఏ.ఎన్,ఎం, సిబ్బంది, టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి కాపీయింగ్ కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. ఎలక్ట్రానిక్ వాచీలు వంటి ఉపకరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావ్, అధికారులు పరమేశ్వర్, తహసీల్దార్ లు మల్లేష్, రాజు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## అంగన్వాడి పిల్లలను కంటికి రెప్పలా
# కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉంది

* **మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగ, వయోవృద్ధుల శాఖ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్**

**వికారాబాద్, మార్చి22 (సమయం న్యూస్) :** గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, పిల్లల అంగవైకల్యం, తదితర అంశాలపై సిడిపిఓ లు, సూపర్ వైజర్లు, సఖీ, ఐసిపిఎస్ అధికారులు, సిబ్బందితో ప్రధాన కార్యదర్శి సమావేశం నిర్వహించి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... అంగన్వాడి పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. పిల్లలను వారి యొక్క తల్లిదండ్రులతో మాత్రమే పంపించాలని, కుటుంబ సభ్యులు కాని వారితో పిల్లలను పంపించకూడదని ఆమె సూచించారు. పిల్లల జీవితాలను మెరుగు పర్చేందుకు బృహత్తర కార్యక్రమాన్ని తీసుకొని శారీరక వైకల్యం, ఫిట్స్, ఉబ్బసం, ఆకస్మిక కదలికలు, స్పృహ తప్పడం, వినికిడి సమస్య, కారణం లేకుండా శిశువు ఏడ్వడం, మానసిక సమస్య తదితర సమస్యలను గుర్తించి అవసరమైన చికిత్సలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సామ్, మామ్ పిల్లలు లేకుండా చూడాల్సిన బాధ్యత మనపై వుందని ఆమె తెలిపారు. జిల్లాలో బాల్యవివాహాలు జరగకుండా చర్యలు తీసుకుంటూ, బాల్య వివాహాలపై సమాజంలో అవగాహన కల్పించాలని ఆమె అధికారులు సూచించారు. స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న అనాధాశ్రమాలను అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని ఆమె తెలిపారు. పిల్లలు మంచి అలవాటులపై అవగాహన కల్పించాలని ఆమె పేర్కొన్నారు. అంగన్వాడీలో మెరుగైన సౌకర్యాల కోసం టాయిలెట్లు, త్రాగునీరు, విద్యుత్ కు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించినట్లయితే పరిష్కారిస్తామని ఆమె తెలిపారు. ముందుగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, సంబంధిత అధికారులతో కలిసి జిల్లాలో అంగన్వాడి కేంద్రాల్లోని వివిధ సమస్యలతో బాధపడే 140 మంది పిల్లల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. గ్రామాల్లో గృహాలను సందర్శించి వారం రోజుల్లో అనారోగ్యంతో కూడిన పిల్లల వివరాలను సేకరించి శస్త్ర చికిత్సల కోసం కృషి చేయాలని వైద్యాధికారులకు సూచించారు. 6 సంవత్సరాల లోపు పిల్లల పెరుగుదల ఎదుగుదలకు అధికారులు కృషి చేయాలని ఆమె తెలిపారు. సమీక్ష సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, వయో వృద్ధులు, ట్రాన్స్ జెండర్ శాఖ డైరెక్టర్ శైలజ, ఆర్జేడి మోతి, రాష్ట్ర సిడీపీఓ అరుణ, డిపీవో జయసుధ, మానసిక వైద్యులు డాక్టర్ శ్రవణ్ రెడ్డి, రుషికేశ్ లు, సిడి పి ఓ లు, సూపర్వైసర్లు, తదితరులు పాల్గొన్నారు.





## సామాజిక బాధ్యతను చాటిన పాత్రికేయ మిత్రులు

**ఆదిలాబాద్ మార్చి21 (సమయం న్యూస్):** గురువారం తన సామాజిక బాధ్యతను చాటుకున్నారు. విధి నిర్వహణలో భాగంగా ఆదిలాబాద్ రూరల్ మండలం ఖండాలకు వెలు తున్న సమయంలో తంతోలి గ్రామ సమీపంలో ఓ యువకుడు పిట్స్ వచ్చి బైక్‌పై నుంచి కింద పడ్డాడు. ఎండలో అల్లాడుతున్న ఆ యువకుడి పరిస్థితికి చలించిన పాత్రికేయ మిత్రులు వాహనాన్ని ఆపి బాధితుడిని విలేకరులు అక్కడున్న వారి సాయంతో రోడ్డు పక్కకు తప్పించారు. నీళ్లు తాగించి ఆ యువకుడి కుటుంబీకులు వచ్చే వరకు అక్కడే ఉన్నారు. కుటుం బీకులకు అప్పజెప్పి అక్కడి నుంచి వినుదిరిగారు.



## ఫికస్ గార్డెన్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలి

**: కమిషనర్ ఇలంబర్తి**

**హైదరాబాద్, మార్చి21 (సమయం న్యూస్):** జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 51 లో గల ఫికస్ గార్డెన్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి యుబిడీ, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కమిషనర్ జోనల్ కమిషనర్, యు బి డి అడిషనల్ కమీషనర్, హార్టికల్చర్, డిప్యూటీ కమీషనర్ లతో కలిసి గార్డెన్ మొత్తం కలియ తిరిగి అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, సుందరీకరణ పనులను పరిశీలించి గార్డెనింగ్ లో బాగా అనుభవం ఉన్న ఆర్కిటెక్ తో ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దుర్గం చెరువు పై భాగాన ఉన్న నేపథ్యంలో దుర్గం చెరువు వైపు నుండి కూడా ఫార్మేషన్ రోడ్డు కాంపౌండ్ వాల్ తో పాటు గేటు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్ నెంబర్ 47 వైపు కూడా గేటు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గార్డెన్ లో లైటింగ్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి పార్కు అభివృద్ధి చేసిన తర్వాత నిర్వహణకు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కు గాని, వాకర్స్ అసోసియేషన్ కు బాధ్యతలు ఇవ్వాలని సూచించారు. ఈ పర్యటనలో జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కమీషనర్ యు బి డీ సుభద్ర దేవి, శానిటేషన్ అడిషనల్ కమీషనర్ రఘు ప్రసాద్, జూబ్లీ హిల్స్ డిప్యూటీ కమీషనర్ ప్రశాంతి, హార్టికల్చర్ అధికారులు సునంద, చంద్రశేఖర్, ఈ ఈ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





## పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

* **ప్రతి విద్యార్థిని పరిశీలించి పరీక్షా కేంద్రంలోకి పంపాలి**
* **పోలీసులు అప్రమత్తంగా ఉండాలి**

**మార్చి21 (సమయం న్యూస్) :**పదవ తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. శుక్రవారం విజయనగర్ కాలనీలోని సెయింట్ అన్నాస్ బాలికల ఉన్నత పాఠశాలలో గల పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ సరళిని పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా త్రాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షా కేంద్రం ముందు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మెయిన్ గేట్ వద్ద విద్యార్థులను బాలురను, బాలికలను వేరువేరుగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపాలని పోలీసులను సూచించారు. పరీక్షా కేంద్రంలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలని చీఫ్ సూపర్డెంట్ ను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ పెరుమల్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి పట్టణంలో
# తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలి

**: జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**

* **మున్సిపల్ అధికారులు మిషన్ భగీరథ సిబ్బందితో కలెక్టర్ సమీక్ష.**

**సంగారెడ్డి మార్చి21 (సమయం న్యూస్) :** పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా, నిరంతరంగా శుద్ధమైన త్రాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ ఇంజనీర్లు, మున్సిపల్ అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. శుక్రవారం మిషన్ భగీరథ ఇంజనీర్లు, మున్సిపల్ కమిషనర్లతో కలిసి పట్టణం లోని డ్రైవర్స్ కాలనీ లోగల మిషన్ భగీరథ పంప్ హౌస్ వద్ద సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డారు. ముఖ్యంగా వేసవిలో నీటి ఎద్దడి సమస్య ఎదురుకాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి కాలంలో నీటి అవసరాలకు అనుగుణంగా తగినన్ని వాటర్ ట్యాంకులను సిద్ధం చేయాలని సూచించారు. అంతేకాకుండా, ప్రత్యామ్నాయ నీటి వనరులను ఉపయోగించి పట్టణం, గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సరఫరాను నిరంతరంగా కొనసాగించాలని, జిల్లా లో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన నీరు అందించడమే కాకుండా, నీటి వృధాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అమృత జల్ 2.0 పథకం కింద చేపట్టిన పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ క్రమంలో డ్రైవర్స్ కాలనీ లోగల మిషన్ భగీరథ పంప్ హౌస్ పరిశీలించారు. పట్టణ ప్రజలకు ప్రతి రోజు తాగునీరు సరఫరా చేసే విధానాన్ని , రాజంపేట ఫిల్టర్ బెడ్‌ను సందర్శించి వాటర్ క్లీనింగ్ ప్రక్రియ, నీటి నిల్వ వివరాలను అడిగితెలుసుకున్నారు. మిక్సింగ్, క్లోరినేషన్ ప్లాంట్ల నిర్వహణపై సమగ్ర అవగాహన కలిగివుండాలని అన్నారు . సంగారెడ్డి పట్టణంలో సాలిడ్ వెస్ట్ మేనేజ్మెంట్ పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేకంగా, వేసవి కాలంలో పట్టణ పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. నీటి సరఫరాతో పాటు పట్టణం లోని పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగు పర్చేందుకు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పనులను వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ ఈ రఘువీర్ , ఈ ఈ విజయలక్ష్మి , మునిసిపల్ కమిషనర్ ఎస్ సి వి కె చవాన్ , మునిసిపల్ డిప్యూటీ ఇంజనీరింగ్ అధికారి ఇంతియాజ్ అహ్మద్ , పబ్లిక్ హెల్త్ అధికారి కృష్ణ మోహన్ , ఏ ఈ రఘువీర్ , అద్దికారి అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## సంపాదకీయం

# దక్షిణాధిపథ్య రాజకీయం !

దక్షిణ రాష్ట్రాల్లో పాగా వేయలన్నది బిజెపి ఆశ.. దాన్ని అడ్డుకోవాలన్నది డిఎంకె తదిర ప్రాంతీయ పార్టీల వ్యూహం. అందుకే తొలుత హిందీ వ్యతిరేకతతో మొదలైన యుద్ధం ఇప్పుడు డీ లిమిటేషన్ వ్యవహారం తెరపైరకి తెచ్చారు. నిజానికి డీ లిమిటేషన్ వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదు. అయితే రాజకీయం కనుక రచ్చ చేయాలన్నదే రాకీయ పార్టీల లక్ష్యం. మొన్న పార్లమెంట్ ఎన్నిల్లో బిజెపి కోరుకున్న 400 మార్కును దాటలేక పోయారు. దీంతో కొత్త వ్యూహాలను అమలు చేసేందుకు సిద్దం అవుతారని అందరికీ తెలుసు. బిజెపిని అధికారం నుంచి తొలగించకుండా పక్కాగా ప్లాన్ చేయడమెలా అన్నది మోడీ ద్వయానికి బాగా తెలుసు. అందుకే వారు దక్షిణాది వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ఉత్తరాదిలో రాముడు రక్షిస్తాడన్న ధీమా వచ్చేసింది. రామనామం ఉత్తరాదిలో ఊపేస్తోంది. అనన్య సాధ్యమైన అయోధ్య సాకారం అయ్యింది. దీంతో ఉత్తరాదిలో బిజెపికి తిరుగులేదన్న విధంగా పరిస్థితులు ఉన్నాయి. కానీ దక్షిణాది పరిస్థితి వేరు. కర్నాటక కూడా చేజారిపోయింది. తెలంగాణలో వచ్చిన అవకాశాన్ని చేజేతులా జారవిడుచుకున్నారు. తెలంగాణలో 17 సీట్ల కోసం పోటీపడి 8సీట్లు సాధించారు. ఇదే తరహాలో మిగతా రాష్ట్రాల్లోనూ గెలవాల్సి ఉంది. ఒడిషాలో అధికారం చేపట్టారు. అందుకే తమిళనాడు, కర్నాటక, కేరళ, తెలంగాణల్లో పట్టు సాధించేంవదుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. దక్షిణాదిని గుప్పిట పెట్టుకోవాలని పట్టుదలగా ఉన్నారని కనిపిస్తోంది. తాజాగా కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ దారికొచ్చారు. మోడీని, ఆయన విదేశాంగ విధానాన్ని సమర్థిస్తున్నారు. ఇలా కొందరు నేతలతో బిజెపిని పొగిడిరచుకోవడం కూడా ఓ ఎత్తుగడే. తమిళనాట అన్నాడిఎంకె దూరమైనా చిన్నాచితక పార్టీలతో జతకట్టారు. గవర్నర్‌గా ఉన్న తమిళసై మళ్లీ రాజకీయ అరంగేట్రం చేసినా ఫలితం దక్కలేదు. అయితే అన్నామలై అక్కడ గట్టిగానే పోరాడుతున్నారు. బిజెపిని ముందునుంచి ప్రజలు ఉత్తరాది పార్టీగానే గుర్తిస్తూ వచ్చారు. అయితే దానిని తిరగరాస్తూ కర్నాటకలో కాలుమోపారు. కానీ స్థానిక నాయకత్వం నిర్లక్ష్యం, అవినీతి కారణంగా గత అసెంబ్లీ మూల్యం చెల్లించుకోక తప్పలేదు. బిజెపి జాతీయవాదానికి దేశవ్యాప్త ఆమోదం కోసం యత్నిస్తోంది. భారతదేశంలో బిజెపి అంతటా విస్తరించిందని చెప్పుకోవడం కూడా అవసరం. అందుకే విజయం కోసం భారతీయ జనతాపార్టీ తీవ్రంగా యత్నిస్తోంది. గత పదేళ్ల బిజెపి పాలనా కాలం తీసుకుంటే అన్ని రాష్ట్రాల్లో విస్తరించేందుకు చేయని ప్రయత్నం లేదు. కేవలం నినాదాలకే పరిమితం కాకుండా అభివృద్ధి, సెంటిమెంట్ ఎజెండాలను కలుపుకుని ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈశాన్యంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధికి పెద్దపీట వేసింది. బెంగాల్ లోను, దక్షిణ రాష్ట్రాల్లో గెలుపు కోసం బూత్‌లెవల్ కార్యాచరణను అమలు చేస్తోంది. క్షేత్రస్థాయి నుంచి పనిచేసుకుంటూ పథకం ప్రకారం బలాన్ని పెంచుకోగలిగిన శక్తిని బీజేపీ ప్రదర్శిస్తోంది. కార్యశీలురైన నాయకులు, కార్యకర్తలు దండిగా ఉన్నారు. ఫలితాలు ఎట్లా ఉన్నా, వారు అలుపెరగకుండా ప్రయత్నాలన్ని చేస్తూనే ఉన్నారు. కర్ణాటక అపజయం బీజేపీకి కొత్తేమీ కాదు. పొత్తులతోనో, ఫిరాయింపులతోనో బీజేపీ కర్ణాటకలో ఒకటి రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు ఒక మైనర్ భాగస్వామిగా అయినా ప్రభుత్వంలో ఉన్నది. తెలంగాణలో తగినంత ఉనికితో ఎప్పటి నుంచో సత్తా చాటుతోంది. గత పార్లమెంటు ఎన్నికలలో 8 స్థానాలతో, సుమారు 20 శాతం ఓట్లతో తన ఉనికిని విస్తరించుకోగలిగింది. కేరళలో 2016లో ఒక ఎమ్మెల్యేను గెలిపించుకున్న బీజేపీ, 2021లో 11 శాతానికి పైగా ఓట్లను సంపాదించింది. అక్కడక్కడా ఉనికిలో ఉన్నప్పటికీ దక్షిణాది ఇంకా పట్టుబడలేదన్న లోటు మాత్రం బీజేపీకి ఉన్నది. దక్షిణాదిలో విస్తరించాలన్న ఆకాంక్ష బీజేపీకి, మోదీకి అంతిమలక్ష్యంగా మారింది. అందుకే దక్షిణాదిపై ఎక్కువగా దృష్టి సారించారు. తమిళనాట చెలరేగుతున్న నిరసలు, ఉద్యమాలను తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు. హిందీ వ్యతిరేకతను ప్రజలే ఛీత్కరించుకునేలా చేస్తున్నారు. డీలిమిటేషన్ కారణంగా ఉత్తరాదిలో మరిన్ని సీట్లు పెరిగే అవకాశమున్నట్లు డిఎంకు తదితర పార్టీలు ఆందోళన చెందుతున్నాయి. తమిళనాడు, కేరళల్లో ప్రస్తుతానికి పరిస్థితి ఆశాజనకంగా ఉంది. మోడీ వ్యక్తిగత ఛరిష్మా కూడా పనిచేస్తోంది. ఆ రెండు రాష్ట్రాల్లో గతం కంటే ఓట్లు, సీట్లు పెంచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. కర్ణాటకలో ఇప్పటికే కాంగ్రెస్ పాలన మీద విముఖత కలిగిందన్న ప్రచారం మొదలయ్యింది. గతంలో ఉన్న బలాన్ని నిలుపుకోవడం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, జనసేన, బీజేపీ కూటమి ఏర్పాటు కావడంతో అక్కడ విజయం సాధించడం ద్వారా కొంత పట్టు నిలుపుకుంది. పవన్ కళ్యాణ్ పేరుకు జనసేనానిగా ఉన్నా, ఆయన ఆశలు,ఆశయాలు బిజెపితో పెనవేసుకుంటున్నాయి. ఆయన వీరికి తురుపుముక్కగా ఉంటారనడం లో సందేహం లేదు. ఈ కలయిక దీర్ఘకాలికంగా బీజేపీ విస్తరణ ప్రయత్నాలకు తోడ్పడగలదు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభావం గణనీయంగానే పెరిగింది. ఇప్పుడది ఆ పార్టీకి కీలకమయిన విజయం అవుతుందని భావిస్తోంది. తెలంగాణలో అధికప్రభావం చూపగలిగితే కనుక, బీజేపీ వెంటనే రెండో స్థానానికి, అతి త్వరలో అధికారస్థానానికి చేరుకోగలుగుతుంది. దక్షిణ భారతదేశంలో తమిళనాడుతో పాటు మూడు కేందప్రాలిత ప్రాంతాల్లో పాగా కోసం బిజెపి అహరహరం అందుకే కృషి చేస్తోంది. డిఎంకె ఎత్తులకు పైఎత్తులు వేస్తోంది. వారు చేసే డీలిమిటేషన్, హిందీవ్యతిరేక ఆందోళనలను తనకు అనుకూలంగా మలచుకుంటోంది. తమిళనాడులో గత బీజేపీకి ప్రస్తుత బీజేపీకి పూర్తిగా తేడా కనిపిస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడిగా అన్నామలై బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి క్షేత్రస్థాయిలో పార్టీ బలపడుతూ వస్తోంది. పాదయాత్రలతో పాటు.. డీఎంకే అవినీతిపై ఆయన ఆరోపణలు చేస్తూ.. ఆధారాలు విడుదల చేశారు. దీంతో డీఎంకే సైతం బీజేపీని టార్గెట్ చేయడం మొదలుపెట్టింది. దీంతో డీఎంకే, అన్నాడీఎంకే మధ్య పోరు.. డీఎంకే, బీజేపీగా అన్నామలై మార్చేశారు. ప్రధాని మోదీ సైతం తమిళనాడుపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇలా కేరళలోనూ ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ క్రమంలో బిజెపికి కేంద్రంలో అధికారంలో ఉండడం కలసి వస్తోంది.

## మార్చి 22 నుంచి ఏప్రిల్ 5 వరకు

# రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్

: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

* రెవెన్యూ సమస్యల పరిష్కారం పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, మార్చి21: (సమయం న్యూస్) :** మార్చి 22 నుంచి ఏప్రిల్ 5 వరకు రెవెన్యూ సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం రోజున జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి రెవెన్యూ సమస్యల పరిష్కారం పై అదనపు కలెక్టర్ డి.వేణు, ఆర్డీవోలు, సంబంధిత తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మండలాలలో ఉన్న ప్రభుత్వ భూముల సంరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఎల్.ఆర్.యూ.పి కార్యక్రమంలో జరిగిన పొరపాట్ల సవరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమం కింద జిల్లా మండల స్థాయిలలో మనకు వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. భూ వివాదాలపై ఉన్న కోర్ట్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ భూ సమస్యలపై మార్చి 22 నుంచి ఏప్రిల్ 5 వరకు ప్రత్యేక నిర్వహిస్తూ సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని, కోర్టు కేసులు, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు, ప్రభుత్వ భూముల సంరక్షణ, ఎల్.ఆర్.యూ.పి సవరణ వంటి పనులకు ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు సురేష్, బి.గంగయ్య, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ సూపరిండెంట్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై

# విస్తృతంగా ప్రజలకి అవగాహన కల్పించాలి



**భూపాల్ పల్లి ( సమయం న్యూస్) :** వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడదెబ్బ తగలడానికి గల ప్రధాన కారణాలు, లక్షణాలు, నివారణ చర్యలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రచారం చేపట్టి, ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. సమావేశంలో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల వాల్ పోస్టర్లను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రజలు సరైన జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్య పరంగా వడదెబ్బ నుండి సురక్షితంగా ఉండడంతో పాటు ప్రాణ నష్టాలను తగ్గించుకోవచ్చని ఆయన తెలిపారు. ముఖ్యంగా వేడిని తట్టుకోలేని చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటలకు బయటికి రాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయొద్దని, చేయాల్సి వస్తే ప్రయాణ సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలి తెలిపారు. వదులుగా ఉండే కాటన్ దుస్తులు, ఎండ తగలకుండా తల కవరయ్యే విధంగా టోపి, కండువా, గొడుగు లాంటివి ధరించాలని అన్నారు. ఉపాధి హామీ పదకం పనులు జరిగే ప్రాంతాల్లోకూలీలకు నీడ సౌకర్యం, ఓఆర్ఎస్, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఏదేని అస్వస్థతకు గురైతే అలసత్వం వహించగా తక్షణ వైద్య సేవలు తీసుకోవాలని సూచించారు. నిల్వ పదార్థాలు తినొద్దని, సాధ్యమైనంత వరకు బయటి పదార్థాలు, వేపుళ్ళు వంటివి తగ్గించుకోవాలన్నారు. అత్యవసర సేవలకు 108, 102 సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. రక్షణ చర్యలపై కార్మికులకు, వాహన డ్రైవర్లుకు, ఆయా శాఖల సిబ్బందికి, తద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పశువుల సంరక్షణ కూడా చాలా ముఖ్యమని వాటిని ఎండ నుండి కాపాడుకోవాల్సిన భాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా నవీన్, డిపిఓ నారాయణరావు, ఎన్సీడీ పిఓ డా రవి రాథోడ్ రవాణాశాఖ అధికారి మహ్మద్ సంధాని, వ్యవసాయ అధికారి వీరు నాయక్, సహాయ కార్మిక అధికారి వినోద, సిపిఓ బాబురావు, పశుసంవర్ధక శాఖ అధికారి డా కుమార స్వామి, డా ఉమాదేవి, డా సందీప్, డా శ్రీకాంత్, డా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. నర్సింగ్ విద్యార్థులకు తరగతులు నిర్వహణకు తాత్కాలికంగా ఆయుష్ భవనం వినియోగించడానికి అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో వైద్య, నర్సింగ్, ఆయుష్, సీహెచ్‌సీ, టీజీఎంఎస్ఐడిసి ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆయుష్ భవనం లోని రెండు అంతస్థులను నర్సింగ్ కళాశాల నిర్వహణకు కేటాయించాలని కలెక్టర్ సూచించారు. ప్రధాన ఆసుపత్రి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధి కార్యాలయం నుండి అవసరమైన సిబ్బందిని సర్దుబాటు చేసి, కళాశాల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నర్సింగ్ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. తాత్కాలికంగా భవనం వినియోగం గురించి కమిషనర్ తో మాట్లాడతానని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాకాధికారి డా మధుసూదన్, ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా నవీన్, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజేశం, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమా మహేశ్వరి, ఆయుష్ ఇంచార్జ్ తనూజా రాణి, టిజిఎంఎస్ఐడిసి డీఈ రాందేవ్, ఏ ఈ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షన్-2024 ఫీడ్ బ్యాక్ అందించేలా అవగాహన కల్పించండి

: బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని థానాజి వాకడే*

* మెప్మా అధికారులతో సమావేశం....



**వరంగల్ కార్పొరేషన్ మార్చి21 (సమయం న్యూస్) :** స్వచ్ఛ సర్వే క్షన్ 2024 యందు ఫీడ్ బ్యాక్ (ప్రజాభిప్రాయం) అందించేలా అవగాహన కల్పించాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని థానాజి వాకడే అధికారులను ఆదేశించారు. శుక్రవారం మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ల (సి ఓ)తో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్2024 యందు సిటిజన్ ఫీడ్ బ్యాక్ లో నగరానికి ఎక్కువ మార్కులు సాధించడానికి ప్రజలను భాగస్వాములను చేసి సమాచారం అందజేయడం వల్ల నగరానికి మంచి స్కోరు లభిస్తుందని అ దిశగా సీవోలు రిసోర్స్ పర్సనల్ ద్వారా ఫీడ్ బ్యాక్ అం దించేలా చూడాలని ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 31 తో 25% రిబేట్ ముగుస్తున్నందున పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ఆర్పి లు ఫోన్లు ద్వారా సమాచారం అందించేలా చూడాలని ఈనెల చివరకు ఆర్థిక సం. ముగుస్తున్నందున బల్దియా కు బకాయి పడి ఉన్న ఇప్పటివరకు ఆస్తి నల్లా పన్నులకు చెల్లించని వారికి మెప్మా విభాగం ద్వారా ఆర్పీలు రెడ్ నోటీసులు అందజేసి పన్నులు చెల్లించేలా కృషి చేయాలని ఈ సందర్భంగా కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ (అడ్మిన్) రాజేశ్వరరావు టి ఎం సి రమేష్ సి ఓ లు సఫియా శ్రీలత సకినాల రమేష్ స్వాతి అలీ తదితరులు పాల్గొన్నారు.

# మంచి నీటి వృధాను అరికట్టిన కార్పొరేటర్

**అంబర్ పేట, మార్చి 21, సమయం న్యూస్:** అంబర్ పెట్ డివిజన్ ప్రేమ్ నగర్ లో మంచినీటి వాల్ నుండి నీరు లీకేజ్ అవుతుండడంతో స్థానికులు అంబర్ పెట్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ గారి దృష్టికి తేగా వెంటనే స్పందించిన కార్పొరేటర్ సంబంధిత అధికారులతో కలిసి అక్కడికి వెళ్లి వాల్ నుండి నీరు లీకేజ్ అవుతున్న విషయాన్ని అధికారులకు వివరించి వెంటనే బాగు చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధికారులు ఏఈ ప్రదీప్, వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు స్థానికులు భాష శ్రీనివాస్ దన్ రెడ్డి శంకర్ యాదయ్య మధు సంతో చారి తదితరులు పాల్గొన్నారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలను అందించాలి

* హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
* ఐనవోలు పీహెచ్ సీని తనిఖీ చేసిన కలెక్టర్



**హన్మకొండ మార్చి21 (సమయం న్యూస్) :** హనుమకొండ: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగులకు మెరుగైన సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని ఇన్ పేషంట్ వార్డును సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ మాట్లాడారు. మెడికల్ ఆఫీసర్ కార్యాలయాన్ని సందర్శించి ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు సిబ్బంది హాజరు పట్టికను, స్టాక్ రిజిస్టర్, మెయింటెనెన్స్ రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న కొందరు సమావేశానికి హనుమకొండకు వెళ్ళగా కలెక్టర్ ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎన్ని ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ రావును అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ఓఆర్ఎస్ ప్యాకెట్ల డబ్బాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఓఆర్ఎస్ ప్యాకెట్లను సబ్ సెంటర్ల ద్వారా పంపిణీ చేయాలన్నారు. ఆరోగ్య సేవల కోసం ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు వైద్యులు సిబ్బంది అందుబాటులో ఉండి సేవలను అందించాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ విక్రమ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## నాంపల్లి పి హెచ్ సి సేవలు
# అభినందనీయం



* వైద్యాధికారి సిబ్బంది అభినందనలు
* జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి.

**నల్గొండ మార్చి21( సమయం న్యూస్) :** నాంపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ద్వారా మంచి వైద్య సేవలందిస్తున్నందుకుగాను పీహెచ్ సి వైద్యాధికారిణి డాక్టర్ భవాని ని,సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అభినందించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ నాంపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి సిబ్బంది హాజరు రిజిస్టర్, ఓపి రిజిస్టర్,ఈ డి డి,ఏ ఎన్ సి తో పాటు అన్ని రిజిస్టర్ లను తనిఖీ చేయడమే కాకుండా , ఏ ఆసుపత్రిలో లేనివిధంగా నాంపల్లి పీ హెచ్ సి లో 7 మంది ఇన్ పేషెంట్లు ఉండడం చూసి జిల్లా కలెక్టర్ ఆసుపత్రికి వచ్చిన ఇన్ పేషెంట్లతో మాట్లాడారు. ఆస్పత్రిలో వైద్య సేవలు ఎలా ఉన్నాయని ? డాక్టర్ అందర్నీ పరీక్షిస్తున్నారా? అని అడిగారు .డాక్టర్ భవాని మేడం మంచి వైద్య సేవలు అందిస్తున్నారని అందువల్ల తాము నాగర్ కర్నూల్ నుండి ,హైదరాబాద్ నుండి వచ్చామని ఇద్దరు పేషెంట్లు కలెక్టర్ కు తెలిపారు. కాగా శుక్రవారం జిల్లా కలెక్టర్ హెచ్ సి ని సందర్శించే సమయానికే 73 మంది ఓపి పేషెంట్లు వైద్య సేవలు పొందడం పట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ భవానిని అభినదించారు.డాక్టర్ తో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి రోగులు ఆసుపత్రికి వస్తున్నారని? అడిగారు. బాలికల హాస్టల్ కు రెగ్యులర్ గా వెళ్తున్నారా ? అక్కడ సమస్యలు ఏంటని ప్రశ్నించగా? విద్యార్థినిలు చాలామంది రక్తహీనతతో బాధపడుతున్నారని డాక్టర్ భవాని సాగర్ జిల్లా కలెక్టర్ తెలుపగా, బాలికలు రక్తహీనతతో బాధపడకుండా వారికి హెల్త్ ఎడ్యుకేషన్ ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఆస్పత్రి పరిధిలో ఇప్పటివరకు జరిగిన శిశు మరణాల సంఖ్యను అడిగగా గత సంవత్సరం డిసెంబర్ వరకు 6 కేసులు నమోదు కాగా, అనంతరం ఈ మూడు నెలల్లో ఎలాంటి శిశు మరణాలు లేవని డాక్టర్ తెలిపారు. శిశు మరణాలు లేకుండా చూడాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని జిల్లా కలెక్టర్ అన్నారు. గర్భిణీ మహిళలు పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని , రక్తహీనత లేకుండా మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణీ స్త్రీలు ఎండకు వెళ్లకుండా తగువిధంగా తాగు నీటితో పాటు, ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి ఆటో క్లేవ్, ఫీటల్ డాప్లర్ ,సర్జికల్ పరికరాలను మంజూరు చేశారు . అనంతరం జిల్లా కలెక్టర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వంటగది, డైనింగ్, తరగతి గదులు, భోజనం అన్నిటిని పరిశీలించారు. వంటగదితోపాటు, డైనింగు, పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని ,ప్రత్యేకించి గ్యాస్ స్టవ్ ను రోజు శుభ్రం చేయాలని సూచించారు. 5 వ తరగతి, 10 వ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థినిలు ప్రత్యేకంగా ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని బాగా చదవాలని, క్రమ పద్ధతిలో లక్ష్యసాధనకు కృషి చేయాలని అన్నారు. విద్యార్తినిలకు పలు ప్రశ్నలు వేయడం ద్వారా జవాబులు రాబట్టి వారి విద్యా సామర్థ్యాలను తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ వెంట నాంపల్లి తహసిల్దార్ జి .దేవా సింగ్, ఎంపీడీవో శ్రీనివాస శర్మ, ఎంపీఓ ఝాన్సీ, తదితరులు ఉన్నారు.

## పదవ తరగతి పరీక్షలను
# కట్టుదిట్టంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి

* పరీక్షలు జరిగే ప్రదేశాలలో ఆ సమయానికి (163) BNSS సెక్షన్ అమలు
* జిల్లాలో మొత్తం (68) పరీక్ష కేంద్రాల ఏర్పాటు
* పది వార్షిక పరీక్షలకు మొత్తం (10,388) మంది విద్యార్థుల హాజరు
* జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ , మార్చి21(సమయం న్యూస్) :** జిల్లాలో పదవ తరగతి పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు *జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం హవేలీ ఘన్పూర్ మండలం సర్దన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే పది పరీక్షలకు (68) సెంటర్లలో (10388) మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఉదయం 9:30 గంటల నుంచి 12:30 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. 03 ఫ్లైయింగ్ స్క్వాడ్. (17) సిట్టింగ్ స్క్వాడ్ లు, (68) చీఫ్ సూపరింటెండెంట్ లు, (70) డిపార్ట్మెంటల్ అధికారులు, 590 మంది ఇన్విజిలేటర్స్ నియమించామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ఒక ఏఎన్ఎం, ఒక ఆశా ఉంటారని, ఫ్లయింగ్ స్క్వాడ్ లు రెండు బృందాలుగా, ఒక్కో బృందంలో ముగ్గురు చొప్పున, ఆ ఆరుగురిలో ఇద్దరు రెవెన్యూ నుంచి, ఇద్దరు విద్యా శాఖ నుంచి, ఇద్దరు పోలీసులు ఉంటారన్నారు. మూడు రూట్లలో ముగ్గురు రూట్ అధికారులను కేటాయించామని వెల్లడించారు. పరీక్ష కేంద్రాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, విద్యార్థులకు తాగునీరు, బెంచీలు, బల్లలు, కుర్చీలు, మూత్రశాలల సౌకర్యం వంటి అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. పోలీస్ ఎస్కార్ట్ తో ప్రభుత్వ వాహనంలో నిర్దేశించిన ఆయా రూట్లలో మాత్రమే పరీక్ష పేపర్లను పరీక్ష కేంద్రాలకు తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎగ్జామ్ ప్యాడ్, పెన్, పెన్సిల్, రబ్బర్, హాల్ టికెట్లను మాత్రమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. ప్రతి సెంటర్ కు ఇద్దరు కానిస్టేబుళ్ళతో బందోబస్తు నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాలకు కాంపౌండ్ వాల్ లేని వాటికి బారికేడ్లను పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ప్రాథమిక చికిత్స కిట్ లు, ఔషధాలు, వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్ లు సరిపడా అందుబాటులో ఉండాలని, పరీక్ష రాసే విద్యార్థుల గదుల్లో ఎలాంటి మెటీరియల్ లేకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పేపర్ల తనిఖీ నిర్వహించాలని తెలిపారు. అలాగే ఎక్కడా కూడా మాల్ ప్రాక్టీస్ కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా బస్సుల సౌకర్యం కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల పని తీరును సరిచూసుకోవాలని తెలిపారు. అలాగే ప్రతి విద్యార్థిని నిశితంగా పరిశీలించిన తర్వాతే పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని పేర్కొన్నారు. ఎక్కడా కూడా మాల్ ప్రాక్టీస్ కు అవకాశం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఎవరికీ కూడా మొబైల్ ఫోన్లు పరీక్ష కేంద్రాలకు అనుమతి లేదన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ఎక్కడా కూడా తప్పులు దొర్లకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా పరీక్ష ప్రశ్న పత్రాలను, ఓఎంఆర్ షీట్ ల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని, పరీక్ష పూర్తయిన తర్వాత సంబంధిత జవాబు పత్రాలను అత్యంత జాగ్రత్తగా పటిష్ట భద్రత నడుమ నిర్దేశిత ప్రాంతాలకు పోస్టల్ అధికారులు చేరవేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు తమ సందేహాల నివృత్తికి జిల్లా విద్యా కార్యాలయాల్లో 9491676947, 9502494882! కంట్రోల్ రూం నంబర్ లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వివిధ శాఖల సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సత్యసాయి డిగ్రీ కాలేజీలో 25న మెగా జాబ్ మేళ




ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి అద్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా పాలకొండలోని శ్రీ సత్య సాయి డిగ్రీ కాలేజీ లో ఈ నెల 25 తేదిన అనగా మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ. నిమ్మక జయకృష్ణ గారు తెలిపారు .ఈ యొక్క మెగా జాబ్ మేళకు 15 ఎం ఎన్ సి కంపెనీ ప్రతినిధులు హాజరయ్యి 760 పోస్టులు కి గాను అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకోవడం జరుగుతుంది అని పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ. నిమ్మక జయకృష్ణగారు తెలియజేయడం జరిగింది. కంపెనీ వివరాలు: To Smart Solutions , Job Dealers, SBI Cards, Foxconn, Deccan Fine Chemicals Pravite Limited, Appollo Pharmacy, Hetero Labs, MedPlus, Paytm, Airtel Payments Bank,Manjushree Technopark,Muthoot Microfin, Dixon Tecnologies,Rockman Industries, Navata Road Trasfrot వంటి బహు జాతీయ కంపెనీస్ హాజరు అవుతున్నాయి. ఈ యొక్క చక్కటి అవకాశాన్ని నిరోద్యోగ యువతీ మరియు యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు . పదో తరగతి , ఇంటర్ , ఐటీఐ, డిప్లొమా,డిగ్రీ , ఎంబీఏ , బి.టెక్, ఎంఎస్సి చదివిన అభ్యర్థులు అర్హులు అని వారు తమ వివరములు naipunyam.ap.gov.in వెబ్ సైట్ నమోదు చేసుకోవాలని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సాయికుమార్ గారు తెలిపారు . ఈ జాబ్ మేళ పోస్టర్ ఆవిష్కరన కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి యూ.సాయి కుమార్ , శ్రీ సత్య సాయి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఏ . శ్రీనివాసరావు ,సీతంపేట ఎంపిడిఓ గీతాంజలి గారు. మరియు టీడీపీ పట్టణ అధ్యక్షులు మరియు స్కిల్ డెవలప్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు. మరిన్ని వివరములు కోసం 6301275511, 7993795796 నంబర్లును సంప్రదించాలన్నారు.




ధర్మ పరిరక్షకురాలు అహల్య దేవి 300వ జయంతి వేడుకలను పురస్కరించుకుని అహల్య దేవి జీవిత చరిత్రను ప్రజలకు పరిచయం చేసే ఉద్దేశంతో ఈనెల 23న నగరంలో "రాష్ట్ర సమర్థ - దేవి అహల్యకీ పుణ్యగాధ" పేరిట నాటిక ప్రదర్శించనున్నారు. కుటుంబ విలువల పరిరక్షణే ధ్యేయంగా విశ్వమాంగల్య సభ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో ఈ నాటిక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. .ఈ మేరకు శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశ్వ మాంగళ్య సభ జాతీయ సహా సంఘటన కార్యదర్శి గాయత్రి లోమ్టే, హైదరాబాద్ నగర అధ్యక్షురాలు బి.శృతి, కార్యదర్శి డాక్టర్ పి. ఆశాజ్యోతి, సమన్వయకర్త డాక్టర్ పూనమ్ నోముల్వార్ తదితరులు వివరాలు వెల్లడించారు. సాయంత్రం ఐదున్నర గంటలకు ప్రారంభమయ్యే ప్రదర్శనకు పారిశ్రామికవేత్త భగవతిజీ మహేష్ బల్ద్వా, సంస్థ జాతీయ ఉపాధ్యక్షురాలు నళిని హావ్రే తదితరులు హాజరుకానున్నారని చెప్పారు. నాగపూర్ కి చెందిన 45 మంది కళాకారుల బృందం ఈ నాటికను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. దేశంలోని 51 ప్రాంతాల్లో నాటిక ప్రదర్శించనున్నారని, ఇప్పటికే 21 ప్రాంతాల్లో ప్రదర్శనలు పూర్తయ్యాయని గుర్తు చేశారు. "ఏక్ శ్యామ్ .. దేశ్ కే నామ్" ట్యాగ్ లైన్ తో నిర్వహించనున్న నాటిక ప్రదర్శనకు కుటుంబ సమేతంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దేశంలో జ్యోతిర్లింగాల పునర్నిర్మాణం... ఆలయాల అభివృద్ధి... ధర్మ పరిరక్షణకు... అహల్యా దేవి చేసిన కృషి.. ఆ మహనీయురాలి జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలియజేశారు.

: బషీర్ బాగ్ ,మార్చి21 (సమయం న్యూస్)

# సీబీఐ అదుపులో మెదక్ సెంట్రల్ జీఎస్టీ సూపరింటెండెంట్ రవి రాజన్




మెదక్: మెదక్ సెంట్రల్ జీఎస్టీ కార్యాలయంలో సీబీఐ అధికారులు సోదాలు జరిపారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు జరిపిన సోదాల్లో పలు దస్త్రాలను పరిశీలించారు. మెదక్ జీఎస్టీ సూపరింటెండెంట్ రవిరాజన్ అగర్వాల్‌పై ఆరోపణల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. సోదాల అనంతరం రవి రాజన్ అగర్వాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

# అధిక సాంద్రత పద్ధతి పత్తి సాగు పై అవగాహన

**రాయపోల్, .మార్చి21, సమయం న్యూస్ :** మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన అధిక సాంద్రత ప్రత్తి సాగు పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి రాధిక హాజరై మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో చీడ పీడల యాజమాన్యం గురించి చేపట్ట వలసిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు తెలిపారు. అదేవిధంగా ఎరువుల యాజమాన్యం మరియు మొక్క ఎదుగుదల నియంత్రకాలైన మెపిక్వాటుక్లోరైడ్ (చమత్కార్) దాని




యొక్క ఉపయోగాలు మరియు రైతుల సందేహాలకు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది మరియు ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా . నల్కర్ గారు ,కీటక శాస్త్ర నిపుణులు అయిన డా . రవి గారు, అగ్రానమీ శాస్త్రవేత్త ప్రతాప్ రెడ్డి గారు కూడా రైతులకు అధిక సాంద్రత ప్రత్తి సాగు పై అవగాహన కల్పించారు మరియు ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏడీఏ బాబు నాయక్, మండల వ్యవ సాయ అధికారి ఆర్ నరేష్ మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు రజిత , కవిత, ప్రవీణ్ స్వర్ణలత. ప్రొఫె షినల్స్,రాశి విత్తన బృందం మరియు రైతులు పాల్గొన్నారు .

# ప్రజాప్రతినిధులపై కేసుల విచారణ పురోగతిపై హైకోర్టులో విచారణ

హైదరాబాద్: ప్రజాప్రతినిధులపై కేసుల విచారణ పురోగతిపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ అంశంపై హైకోర్టు ప్రత్యేక ధర్మాసనం శుక్రవారం విచారించింది. మాజీ ఎంపీ హరిరామజోగయ్య దాఖలు చేసిన ప్రయోప్రయోజన వ్యాజ్యాన్ని కలిపి విచారణ జరిపింది. జగన్‌పై నమోదైన సీబీఐ, ఈడీ కేసులను వేగంగా విచారించాలని హరిరామజోగయ్య గతంలో ఫిర్యాదు చేశారు. తెలంగాణలోని వివిధ కోర్టుల్లో ప్రజాప్రతినిధులపై 309కి పైగా కేసులున్నాయని ఏజీ కోర్టుకు తెలిపారు. విచారణలో పురోగతిపై కౌంటర్ దాఖలకు సమయం కోరారు. విచారణ వేగవంతం చేయాలని హైకోర్టు ఆదేశించిందని హరిరామజోగయ్య తరఫు న్యాయవాది తెలిపారు. మార్చి 31వరకు ఉన్న కేసుల పురోగతి తెలపాలని ఏజీకి ఆదేశించిన ప్రత్యేక ధర్మాసనం.. అందుకు నాలుగు వారాల సమయం ఇచ్చింది.

* **డ్రైవర్‌కు వైద్యం అందించాలని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల ఆదేశం**

బెంగళూరులో ఏపీ ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి ఘటనపై ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు స్పందించారు. ఈ



ఘటనపై విచారణ జరపాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును ఆదేశించారు. దాడి చేసిన కర్ణాటక ఆర్టీసీ డ్రైవర్‌పై చర్యలు తీసుకునేలా ఫిర్యాదు చేయాలని సూచించారు. దాడికి గురైన ఏపీ ఆర్టీసీ డ్రైవర్‌కు మెరుగైన వైద్యం అందించాలని ఎండీకి ఆదేశాలు జారీ చేశారు.

# అత్యాచార ఘటనపై అలహాబాద్ హైకోర్టు జడ్జి వ్యాఖ్యలు.. ఖండించిన కేంద్రమంత్రి

దిల్లీ: అత్యాచార కేసు విచారణ సందర్భంగా ఇటీవల అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. మహిళ ఛాతీని తాకడం అత్యాచారం కిందకు రాదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. దీనిపై కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ తీర్పు సమ్మతం కాదని పేర్కొన్నారు. దానిని పరిశీలించాలని సుప్రీంకోర్టును కోరారు. ఇలాంటి తీర్పులతో సమాజంలోకి తప్పుడు సందేశం వెళ్లే అవకాశం ఉందన్నారు.

**అసలేం జరిగిందంటే..?**

2021 నవంబరు నాటి లైంగిక వేధింపుల కేసు ఇది. ఉత్తరప్రదేశ్‌లోని కసగంజ్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ, తన 11 ఏళ్ల (ఘటన జరిగే నాటికి) కుమార్తెతో కలిసి బంధువుల ఇంటి నుంచి తిరిగివస్తుండగా అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు వారిని సమీపించారు. బాలికను ఇంటి దగ్గర దింపుతామని నమ్మించి బైక్‌పై ఎక్కించుకున్నారు. మార్గమధ్యంలో ఆ యువకులు అమ్మాయిపై అత్యాచారానికి యత్నించారు. ఆమెను అసభ్యంగా తాకుతూ వేధింపులకు గురిచేశారు. బాలిక అరుపులు విని అటుగా వెళ్తున్న వారు రావడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించడంతో నిందితులపై కేసు నమోదు చేశారు. అనంతరం ఈ కేసు అలహాబాద్ హైకోర్టుకు చేరింది. ఇటీవల దీనిపై విచారణ జరిపిన జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా సంచలన వ్యాఖ్యలు చేశారు. మహిళ ఛాతీని తాకినంత మాత్రాన అత్యాచారం కిందకు రాదంటూ నిందితులకు అనుకూలంగా తీర్పు వెలువరించారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర మంత్రి స్పందించారు.

# నిమిషానికి రూ.కోటికిపైగా కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు చేస్తోంది: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ అప్పు రూ.8.6 లక్షల కోట్లుగా ఉందని భాజపా శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. రోజుకు రూ.1700 కోట్లకుపైగా కాంగ్రెస్ సర్కారు అప్పు చేస్తోందని విమర్శించారు. బడ్జెట్‌పై శాసనసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. "నిమిషానికి



రూ.కోటికిపైగా కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు చేస్తోంది. రాష్ట్రంలో ఒక్కో వ్యక్తిపై రుణభారం రూ.2.27 లక్షలుగా ఉంది. పెద్ద ఎత్తున రుణాలుంటే తెలంగాణ ఎలా అభివృద్ధి చెందుతుందో చెప్పాలి. యూపీఏ కంటే ఎన్డీఏ హయాంలో ఆర్థిక సంఘం నిధులు పెరిగాయి. యూపీఏ హయాంలో రాష్ట్రాలకు కేంద్ర పన్నుల్లో 32 శాతం వాటా ఉండేది. అప్పుడు కేంద్ర పన్నుల్లో వాటా 23 శాతం కూడా పెంచలేదు. మోదీ ప్రభుత్వం వచ్చాక కేంద్ర పన్నుల్లో వాటా 10 శాతం పెంచి 42 శాతం చేశారు. పన్నుల్లో వాటా పెంచాక కూడా కేంద్రాన్ని విమర్శించడం సరికాదు" అని ఆయన అన్నారు.




# ఈ డేటా ప్లాన్లతో ఫ్రీగా ఐపీఎల్.. వివరాలు ఇవీ..




ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 సందడి రేపటి (మార్చి 22) నుంచి మొదలు కానుంది. క్రికెట్ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ మ్యాచ్‌లను వీక్షించేందుకు జియో హాట్‌స్టార్ అవకాశం కల్పిస్తోంది. దాదాపు రెండు నెలలకు పైగా ఈ లీగ్‌ను డిజిటల్ వేదికగా చూడాలనుకొనే వారి సంఖ్య కోట్లలోనే ఉంటుంది. వారి కోసం ప్రముఖ టెలికాం సంస్థలైన జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా.. జియోహాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌తో ప్రత్యేక డేటా ప్లాన్లను తీసుకొచ్చాయి. ఆ వివరాలు ఇవీ..

**జియో**

రూ.100 ప్లాన్: 90 రోజుల వ్యాలిడిటీ, 5జీబీ డేటాతో జియో ఈ ప్లాన్ అందిస్తోంది. జియోహాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌పై 90 రోజుల వ్యాలిడిటీతో లభిస్తుంది. రూ.299 కంటే ఎక్కువ మొత్తంతో రీఛార్జి చేసుకున్నా ఉచితంగా ఐపీఎల్‌ను వీక్షించే సదుపాయాన్ని జియో కల్పిస్తోంది. మార్చి 31 వరకు మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. పై ప్లాన్లన్నీ ప్రస్తుతం కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

**ఎయిర్‌టెల్**

* రూ.100 ప్లాన్: 5జీబీ డేటా, 30 రోజుల వ్యాలిడిటీ అందిస్తోంది. జియోహాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌పై 30 రోజుల వ్యాలిడిటీతో లభిస్తుంది.
* రూ.195 ప్లాన్: 90 రోజుల వ్యాలిడిటీ, 15 జీబీ డేటా పొందొచ్చు. జియోహాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌పై 90 రోజుల వ్యాలిడిటీతో వస్తుంది.

**వొడాఫోన్ ఐడియా**

* రూ.101 ప్లాన్: 30 రోజుల వ్యాలిడిటీ, 3 జీబీ డేటా, 90 రోజుల పాటు జియోహాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్
* రూ.151 ప్లాన్: 30 రోజుల వ్యాలిడిటీ, 4జీబీ డేటా, 90 రోజుల జియోహాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్
* రూ.169 ప్లాన్: 30 రోజుల వ్యాలిడిటీ, 8జీబీ డేటా, 30 రోజుల పాటు జియోహాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్

## గుజరాత్‌లో రూ.7,500 కోట్ల విలువైన
# ఆర్డర్ పొందిన బీహెచ్ఈఎల్

గుజరాత్‌లోని 'ఉకై' సూపర్‌క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి రూ.7,500 కోట్ల విలువైన ఆర్డర్‌ను పొందినట్లు ప్రభుత్వ యాజమాన్యంలోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (BHEL) శుక్రవారం తెలిపింది. గుజరాత్ స్టేట్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ లిమిటెడ్(GSECL) ద్వారా ఈ ఆర్డర్ పొందినట్లు 'బిహెచ్ఇఎల్' ఒక ప్రకటనలో తెలిపింది. ఈ యూనిట్ 54 నెలల్లో వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించనుంది. గుజరాత్‌లోని తాపి జిల్లాలో ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ & కన్స్ట్రక్షన్ (EPC) ప్రాతిపదికన 1x800 MW 'ఉకై' సూపర్‌క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ (యూనిట్ 7)ను ఏర్పాటు చేయడానికి అంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ కింద BHEL ఈ ఆర్డర్‌ను పొందింది. ఈ ప్రాజెక్టులో BHEL.. డిజైన్, ఇంజనీరింగ్, తయారీ, సరఫరా, టెస్టింగ్, కమీషనింగ్‌తో పాటు అవసరమైన అన్ని విద్యుత్, సివిల్, నిర్మాణ పనులను అందిస్తుంది. ఉకైలోని మొదటి థర్మల్ యూనిట్‌ను 1976లో BHEL స్థాపించింది. దశాబ్దాలుగా వీరి విజయవంతమైన భాగస్వామ్యం కొనసాగుతూ ఉంది. దేశవ్యాప్తంగా 1,70,000 MW కంటే ఎక్కువ విద్యుత్ సామర్థ్యాన్ని కలిగి ఉన్న భారతదేశంలోని అగ్రగామి విద్యుత్ పరికరాల తయారీదారుగా..BHEL ప్రసిద్ధి చెందింది.

## ఏప్రిల్ 1 నుంచి ఈ నంబర్లకు యూపీఐ సేవలు బంద్..
# యూజర్లేం చేయాలి?

ఇన్‌యాక్టివ్ లేదా వేరే వారికి కేటాయించిన మొబైల్ నంబర్లకు ఏప్రిల్ 1 నుంచి యూపీఐ సేవలు నిలిచిపోనున్నాయి. ఈ మేరకు బ్యాంకులు, పేమెంట్ సేవలందించే ప్రొవైడర్లకు.. నేషనల్ పేమెంట్స్ కార్పొ రేషన్ ఆఫ్ ఇండియా ఆదేశాలు జారీ చేసింది. అనధికారిక వాడకాన్ని, మోసా లను అరికట్టేందుకు ఆ నంబర్లను డీయాక్టి వేట్ చేయాలని సూచించింది. యూపీఐ వినియోగంలో మొబైల్ నంబర్ కీలకం. ఈ సేవల్లో ఓటీపీ వెరిఫికేషన్ కీలక భూమిక పోషిస్తుంది. అందుకే ఎన్‌పీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఎక్కువకాలం పాటు వినియోగంలో లేని మొబైల్ నం బర్లను టెలికాం కంపెనీలు వేరొకరికి కేటాయి స్తుంటాయి. దీంతో దీర్ఘకాలం పాటు మనం వాడే నంబర్లు వేరొకరికి చేరుతుంటాయి. దాంతో యూపీఐ ఖాతాలు కూడా వారి చేతిలోకి వెళ్లే అవకాశం ఉంది. దీనివల్ల అనధికారిక, మోసపూరిత లావాదేవీలు జరిగే అవకాశం ఉంది. వీటిని నివారించేందుకు ఎన్‌పీసీఐ ఆదేశాల మేరకు గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం వంటి యాప్స్‌తో పాటు బ్యాంకులు ఇన్‌యాక్టివ్ నంబర్లను తొలగించనున్నాయి.

**ఏం చేస్తారు?**

ఇన్‌యాక్టివ్‌లో ఉన్న, ఇతరులకు అసైన్ చేసిన, డీయాక్టివ్ చేసిన మొబైల్ నంబర్లు బ్యాంకులు, పేమెంట్ ప్రొవైడర్లు తొలగిస్తాయి. ఒకవేళ అందులో మీ నంబర్ ఉంటే.. యూపీఐ సర్వీసులను నిలిపివేస్తున్నట్లు నోటిఫికేషన్ పంపిస్తాయి. నోటిఫికేషన్ తర్వాత కూడా నంబర్ ఇన్‌యాక్టివ్‌లోనే ఉంటే మోసాలను అరికట్టేందుకు యూపీఐ నంబర్లను బ్యాంకులు డీలిస్ట్ చేస్తాయి.

**ఎవరిపై ప్రభావం?**

* మొబైల్ నంబర్ మార్చినా బ్యాంకుల వద్ద ఆ నంబర్‌ను అప్‌డేట్ చేయని వారి మీద ప్రభావం ఉంటుంది.
* యూపీఐతో లింక్ చేసి కాల్స్, ఎస్సెమ్మెస్‌లు వంటివేవీ చేయకుండా దీర్ఘకాలం పక్కనపెట్టిన వారు
* బ్యాంకు వివరాలను అప్‌డేట్ చేయకుండా మొబైల్ నంబర్‌ను సరెండర్ చేసినవారు అవాంతరాలు ఎదుర్కొంటారు.
* పాత నంబర్‌ను వేరొకరికి అసైన్ చేసిన సందర్భాల్లో పాత నంబర్ హోల్డర్లపై ఈ ప్రభావం ఉంటుంది.

* **యూపీఐని యాక్టివ్‌గా ఉంచుకోవాలంటే?**




* మీ నంబర్ యాక్టివ్‌గా ఉందో, లేదో చెక్ చేసుకోండి. కాల్స్, మెసేజులు వెళ్తున్నాయో, లేదో చూడండి.
* బ్యాంక్ నుంచి ఓటీపీలు, ఎస్సెమ్మెస్ అలర్ట్‌లు వస్తున్నాయో, లేదో చెక్ చేసుకోండి.
* బ్యాంకుల వద్ద మీ మొబైల్ నంబర్‌ను అప్‌డేట్‌గా ఉండేలా చూసుకోండి.



# పువ్వులు పంచే అందం..!

ఈ సీజన్‌లో రకరకాల పువ్వులు మనకు కనువిందు చేస్తుంటాయి. అవి మన చర్మానికి, ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను కలిగిస్తాయి. కొన్నింటి సువాసనల వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుంటుంది. మరికొన్ని పువ్వులు బ్యూటీ ట్రీట్‌మెంట్లలో చేరి, తమ గొప్పతనాన్ని చాటుతుంటాయి.





బంతిపువ్వులు క్రిమినాశకంగా పనిచేస్తాయి. చర్మంపై దద్దుర్లు, చికాకులకు, మొటిమల సమస్యలు ఉన్నవారికి ఔషధంలా పనిచేస్తుంది. బంతి పువ్వు రేకలను కొద్దిగా నూరి, మొటిమలపై రుద్ది, పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. రోజూ ఇలా చేస్తూ ఉంటే కొద్ది రోజుల్లోనే మొటిమల సమస్య దూరం అవుతుంది.



లావెండర్ మనసుకు శాంతిని కలిగించడంలోనూ, చర్మానికి యాంటీ బాక్టీరియల్‌గానూ ఉపయోగపడుతుంది. మసాజ్‌ల కోసం లావెండర్ నూనెలు, చర్మం డీ హైడ్రేట్ కాకుండా లావెండర్ వాటర్ స్ప్రే చేస్తే తిరిగి కళగా మారుతుంది.

మల్లెలతో చర్మాన్ని ప్రకాశవంతంగా మార్చుకోవచ్చు. పొడి చర్మం గలవారు జాస్మిన్ ఆయిల్, జాస్మిన్ ఫేస్ ప్యాక్‌లు వాడితే మృదువుగా మారుతుంది. ఒత్తిడి ఉపశమనానికి జాస్మిన్ సువాసనలు ఎంతో మేలు చేస్తాయి.

గులాబీ – లావెండర్ ఫ్లవర్ ప్యాక్ కప్పు రోజ్ వాటర్, టీస్పూన్ ఎండిన లావెండర్ పువ్వులు, 5–6 చుక్కల లావెండర్ నూనె తీసుకోవాలి. రోజ్ వాటర్‌ను మరిగించి, ఎండిన లావెండర్ పువ్వులను అందులో వేయాలి. కొద్దిసేపు అలాగే ఉంచి, మిశ్రమాన్ని చల్లబరచాలి. తర్వాత వడకట్టి, ఏదైనా నూనె కలిపి రాసుకోవచ్చు.



మందార పువ్వులు నిస్తేజంగా ఉన్న శిరోజాలకు కండిషనర్‌గా ఉపయోగపడి మెరుపును తీసుకువస్తాయి. మాడుపై ఉండే చర్మం పొడిబారకుండా కాపాడుతుంది. గుప్పెడు మందార పువ్వులను తీసుకొని, వాటిని మెత్తని పేస్ట్‌లా తయారు చేసి,అందులో కొద్దిగా పెరుగు కలిపి తలకు ప్యాక్ వేయాలి. పదిహేను నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. పొడిబారి ఉన్న శిరోజాలు మృదువుగా అవుతాయి.



'గులాబీపువ్వులలో చర్మాన్ని తాజాగా ఉంచేందుకే కాదు ఔషధంగా పనిచేసే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్నాయి. టోనర్‌గా రోజ్‌వాటర్, ఫేస్ మాస్క్‌లు, చర్మ సంరక్షణలో రోజ్ ఆయిల్‌ను ఉపయోగించవచ్చు.









# రెట్రో టు మెట్రో..! సరికొత్త స్టైల్‌కి ఐకానిక్‌గా..

పాల మీగడను తలపించే లేత పసుపు రంగు వసంతకాలాన్ని మరింత కళగా మార్చేస్తుంది. కాంతిమంతమైన రంగులను వెనక్కి నెట్టేస్తూ ఇండో– వెస్ట్రన్ స్టైల్ అయినా, సంప్రదాయ వేషధారణ అయినా ఈ స్ప్రింగ్ సీజన్‌లో బటర్ ఎల్లో స్పెషల్ మార్క్ వేస్తోంది.. పాజిటివ్ ఎనర్జీని చుట్టూ నింపడంలోనూ ప్రకృతిలో కొలువుండే ఆహ్లాదాన్ని కళ్లకు కడుతూ మదిని దోచేస్తోంది. రెట్రో స్టైల్‌కి సరైన ఎంపికగా నిలుస్తోంది. కార్పొరేట్ సంస్కృతికి కొత్త అర్థం చెబుతూ మెట్రో స్టైల్‌తో బెస్ట్ మార్కులు కొట్టేస్తుంది.

ఈ వసంత కాలంలోనే కాదు రా బోయే వేసవిలోనూ హాయిగొలిపే రంగుల జాబితాలో ముందు వరుసలో ఉంటుంది బటర్ ఎల్లో. ఈ లేత పసుపు రంగు షేడ్స్ సంప్రదాయ క్లాసిక్ వేర్‌లోనే కాదు బోల్డ్ కాంట్రాస్ట్ కలర్స్‌తోనూ జత కలుస్తుంది. మృదువైన, ప్రకాశవంతమైన రంగుల ఎంపికలో బటర్ ఎల్లో ముందువరసలో ఉంది.

లాంగ్ గౌన్లు, స్టైలిష్ కార్పొరేట్ వేర్‌గానే కాదు ఫ్యాషన్ వేదికలపైనా లేత పసుపు రంగు తనదైన ముద్ర వేస్తోంది. చందేరీ, షిఫాన్, జార్జెట్ ఫ్యాబ్రిక్‌లలో బటర్ ఎల్లో మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంటే కాటన్, పట్టులలో రిచ్ లుక్‌తో అబ్బురపరుస్తుంది.

కాంట్రాస్ట్ కలర్ ఆలోచనకు ఈ షేడ్‌ను దూరంగా పెట్టవచ్చు. సేమ్‌కలర్ ఎంబ్రాయిడరీ వర్క్, ఫ్లోరల్ ప్రింట్స్‌లో తెలుపు, గాఢమైన పసుపు రంగు మోటిఫ్స్, పోల్కా డాట్స్ బటర్ ఎల్లోను మరింత ఆకర్షణీయంగా మార్చుతాయి.

ఇటీవల బాలీవుడ్ ఫ్యాషన్ ఐకాన్ సోనమ్ కపూర్ ముంబైలోని ఫ్యాషన్ ఈవెంట్ బీవోఎఫ్ గాలాలో డిజైనర్ జార్జ్ స్టావ్‌పోలోస్ రూపొందించిన లేత పసుపు షిఫాన్ గౌను ధరించి అందరి దృష్టిని ఆకర్షించింది.

ఈ లుక్ 1970ల నాటి వింటేజ్ గ్లామర్‌ను తన డ్రెస్సింగ్ ద్వారా చూపింది.. ప్రాచీన అందాన్ని ఆధునికతతో మేళవించినట్టుగా తన డ్రెస్సింగ్ ద్వారా చూపుతూ ఈ సీజన్‌కు తప్పనిసరిగా ఉండవలసిన బటర్ ఎల్లో ప్రాముఖ్యతను చాటింది.





# ఏడేళ్లకే తైక్వాండో శిక్షకురాలిగా గిన్నిస్ రికార్డు..!

కొంతమంది చిన్నారులు అత్యంత చిన్న వయసులో అపారమైన ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తుంటారు. వారి అద్భుతమైన ప్రతిభ ఎవ్వరినైనా ఆశ్చర్యంలో ముంచెత్తడమే గాక కట్టిపడేస్తాయి. అంతేగాదు వాళ్లని చూడగానే "పిట్ట కొంచెం కూత ఘనం" అనే ఆర్యోక్తి గుర్తుకురాక మానదు. అలాంటి ప్రతిభ పాటవాలనే ప్రదర్శిస్తోంది ఈ చిన్నారి. చిన్న వయసులో అత్యంత క్లిష్టమైన విద్యలో ఆరితేరి శెభాష్ అనిపించుకుంటోంది.

ఆ చిన్నారే మధురైకి చెందిన ఏడేళ్ల సంయుక్త నారాయణన్. అసాధారణమైన తైక్వాండో నైపుణ్యాలతో యావత్తు ప్రపంచాన్నే ఆశ్చర్యపరిచింది. ఆ అసాధారణమైన ప్రతిభతో గిన్నిస్ వరల్డ్ రికార్డులకెక్కింది కూడా. అంతేగాదు గిన్నిస్ వరల్డ్ రికార్డు ఇన్‌స్టా పోస్ట్‌లో ఏడేళ్ల 270 రోజుల వయసులో అతి పిన్న వయస్కురాలైన తైక్వాండో బోధకురాలిగా చరిత్ర సృష్టించిందని పేర్కొంది.

ఈ చిన్నారి ఎంతో మంది పిల్లలకు ప్రేరణ. పిల్లలను క్రీడలకు సంబంధించిన వాటిల్లో ప్రోత్సహిస్తే వారిలోని అపారమైన నైపుణ్యాలు వెలికివస్తాయనేందుకు ఈ చిన్నారే నిదర్శనం.





అయితే నెటిజన్లు ఈ గిన్నిస్ పోస్ట్‌పై రకరకాలుగా స్పందించారు. కొందరేమో చిన్న వయసులో తైక్వాండో సాధన చేయడం హానికరం అని ఆందోళన వ్యక్తం చేయగా, మరికొందరు మాత్రం పిల్లలు అసాధారణమై విజయాలు అందుకోగలరని ప్రూవ్ చేసింది ఆ చిన్నారి అంటూ ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

సమయం
APTEL/2006/18267



# MOVIE TIME



## మనుషులు పుట్టుకతోనే దుర్మార్గులా?

'మనుషులు పుట్టుకతోనే దుర్మార్గులా? లేక అది వారిపై బలవంతంగా రుద్దారా?..' అంటూ గతేడాది ప్రేక్షకులకు మరో కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది 'వికెడ్' చిత్రం. సింథియా ఎరివో, జోనాథన్ బెయిలీ, ఏతాన్ స్లేటర్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రమిది. జోన్ ఎమ్.చు తెరకెక్కించిన ఈ సినిమాలో సింథియా ఎరివో.. పచ్చ రంగు ముఖంతో అతీంద్రియ శక్తులు ఉన్న అమ్మాయిగా సరికొత్త అవతారంలో కనిపించి సినీప్రియుల దృష్టిని ఆకట్టుకుంది. ఈ ఏడాది ఆస్కార్‌లో ఉత్తమ నటి సహా పలు విభాగాల్లో నామినేషన్లు సొంతం చేసుకోవడం మరో విశేషం. ఇద్దరు స్నేహితుల మధ్య కథాంశంతో రూపొందిన ఈ మ్యూజికల్ ఫాంటసీ చిత్రం ఇప్పటికే పలు ఓటీటీల్లో సందడి చేస్తోంది. ఇప్పుడీ సినిమా ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో శనివారం నుంచి ఇంగ్లిష్, హిందీ భాషల్లో అందుబాటులో ఉండనున్నట్లు తెలిపింది చిత్రబృందం.



## సమంతకు ఓటీటీ అవార్డ్

మయోసైటిస్ తో బాధపడుతూనే సమంత సిటాడెట్ హనీ బన్నీ అనే వెబ్ సిరీస్ లో నటించిన విషయం తెలిసిందే. ఆ వెబ్ సిరీస్ లో ఆమె నటనకు గాను ఆమెకు ఓటీటీ ఉత్తమ అవార్డు లభించింది. హీరామండి లో నటించిన మనీషా కొయిరాలా, సోనాక్షి సిన్హా, అదితీరావ్ కూడా `ఉత్తమ నటి అవార్డ్` కోసం పోటీపడ్డారు. కానీ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డ్ సమంతను వరించింది. సిటాడెల్ హనీ బన్నీ వెబ్ సిరీస్ లో క్లిష్టమైన స్టంట్స్ తో అదరగొట్టేసింది సామ్. ఆమె శ్రమ వృథా పోలేదు. సామ్ నటన, యాక్షన్ సీన్స్ కి ప్రజల నుంచి అద్భుత స్పందన వచ్చింది. ఆమె ప్రియాంక చోప్రా నటన కంటే, భారతీయ వెర్షన్ రీమేక్ లో బాగా యాక్ట్ చేసిందనే టాక్ తెచ్చుకుంది. రాజ్ & డికె దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌లో వరుణ్ ధావన్ కూడా ప్రధాన పాత్రలో నటించిన సంగతి తెలిసిందే. న్యూస్18 షోషా రీల్ అవార్డ్స్ 2025 ఉత్సవాల్లో పాల్గొన్న సమంత ఆనందానికి అవధుల్లేవ్. అవార్డ్ అందుకున్న సమంత కళ్లలో మెరుపులు కనిపించాయి. తన హార్డ్ వర్క్ కి తగిన గుర్తింపు లభించిందనే ఆనందం తన కళ్లలో కనిపించింది. అవార్డు అందుకున్న సామ్ మాట్లాడుతూ.. 'ఇది నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. నాకు ఇష్టమైన ఎంతోమంది నటీమణులు ఈ అవార్డుల నామినీ బరిలో ఉన్నారు. నిజానికి ఈ సిరీస్‌ను పూర్తి చేయడమే నాకు అవార్డు. ఎన్నో ప్రతికూల పరిస్థి తు ల మధ్య దీన్ని పూర్తిచేశాను. నన్ను నమ్మిన వారికి ఈ అవార్డును అంకితం చేస్తున్నాను. రాజ్ అండ్ డీకే, వరుణ్ ధావన్‌ల కారణంగానే నేను 'సిటడెల్ : హనీబన్నీ'ని చేయగలిగాను. ఈ సిరీస్ పూర్తి చేసేందుకు ఓపికను కూడాగట్టుకొని పనిచేశాను. నన్ను వారంతా ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. ఈ విషయంలో యూనిట్ వారందరికీ కృతజ్ఞతలు' అని సమంత చెప్పారు. ఈ సిరీస్ చిత్రీకరణ సమయంలో ఎన్నోసార్లు స్పృహ కోల్పోయినట్లు సమంత గతంలో వివరించిన విషయం తెలిసిందే.





### సినిమా లేదు.. హిట్ లేదు.. అయినా: సమంత ఎమోషనల్

అభిమానులు తనపై చూపిస్తోన్న ప్రేమకు ధన్యవాదాలు చెప్పారు నటి సమంత. వారి ప్రేమ వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానంటూ భావోద్వేగానికి గురయ్యారు. చెన్నై వేదికగా ఇటీవల జరిగిన బిహైండ్‌వుడ్స్ అవార్డుల వేడుకలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. 2010 నుంచి స్ఫూర్తిదాయక పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్నందుకు ఆమెను కె.బాలచందర్ హాల్ ఆఫ్ ఫేమ్ అవార్డుతో సత్కరించారు. అవార్డు అందుకున్న అనంతరం ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''ఈ అవార్డు అందుకున్నందుకు నాకెంతో సంతోషంగా ఉంది. కె.బాలచందర్ సర్ పేరుతో ఈ అవార్డు అందుకోవడం చాలా ప్రత్యేకం. ఆయన ఎన్నో అద్భుతమైన పాత్రలను మనకు పరిచయం చేశారు. ఆయన తెరకెక్కించిన చిత్రాల్లో స్త్రీ పాత్రలు ఎంతో సహజంగా ఉంటాయి. ఆయన సినిమాల నుంచి నేనెంతో స్ఫూర్తి పొందా. ఈరోజు నా జీవితం పరిపూర్ణమైనట్లు అనిపిస్తుంది. ఈ అవార్డుకు నన్ను ఎంపిక చేసినవారందరికీ ధన్యవాదాలు. సాధారణంగా ఒక సినిమా హిట్ అయితే మనల్ని ప్రేమించేవారు ఉంటారు. కానీ, రెండేళ్లు అయింది ఒక్క తమిళ సినిమా చేయలేదు. ఈ మధ్యకాలంలో హిట్ అందుకోలేదు. అయినా నాపై మీ ప్రేమ ఏమాత్రం తగ్గలేదు. మీ ప్రేమను చూస్తుంటే నాకు మాటలు రావడం లేదు. ఇంత ప్రేమ పొందేందుకు నేనేం చేశానో కూడా నాకు తెలియదు. మీరు లేకుండా నేను లేను'' అని ఆమె చెప్పారు. అభిమానులు డ్యాన్స్ చేయమని కోరగా.. తాను ఇప్పుడే యాక్షన్ సీక్వెన్స్ చేసి వచ్చానని.. డ్యాన్స్ చేయలేనని తెలిపారు. అభిమానుల ప్రేమకు రుణపడి ఉంటానని అన్నారు. చెన్నైకు చెందిన సమంత 'ఏమాయ చేసావె'తో నటిగా తెరంగేట్రం చేశారు. కెరీర్ ఆరంభం నుంచి ఆమె తెలుగుతోపాటు తమిళంలోనూ వరుస సినిమాలు చేసి స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. 2022లో విడుదలైన 'కాతు వక్కుల రెండు కాదల్' తర్వాత ఆమె తమిళంలో ఏ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పలేదు. సమంత కొంతకాలంగా సినిమాల్లోనే కాకుండా సిరీస్‌ల్లోనూ యాక్ట్ చేస్తున్నారు. ఇటీవల ఆమె 'సిటడెల్ హనీ బన్నీ'తో ప్రేక్షకులను అలరించారు. ప్రస్తుతం ఆమె చేతిలో 'రక్త్ బ్రహ్మాండ్', 'మా ఇంటి బంగారం' చిత్రాలు ఉన్నాయి. ఆమె నిర్మాతగా వ్యవహరించిన 'శుభం' త్వరలో విడుదల కానుంది.

## ఎల్లమ్మలో ఎవరు?



బలగం చిత్రంతో సత్తా చాటిన దర్శకుడు వేణు యెల్దండి డైరెక్షన్ లో రూపుదిద్దుకోబోతున్న సినిమా ఎల్లమ్మ. బలగం సినిమాలో పక్కా ఎమోషనల్ కథతో చిన్న పెద్ద తేడా లేకుండా ప్రేక్షకులను కట్టిపడేసిన వేణు.. ఎల్లమ్మ సినిమాతో తెలంగాణ జీవన చిత్రాన్ని మరోమారు ఆవిష్కరించాలని భావించాడు. ఈ సినిమాలో నితిన్ హీరోగా నటించబోతున్నట్లు కన్ఫర్మ్ కాగా. ఈ మూవీలో హీరోయిన్‌గా అందాల భామ సాయి పల్లవి నటించబోతున్నట్లు, కథ నచ్చడంతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని గత కొద్ది రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారినట్లు తెలుస్తోంది. ఏంటంటే 'ఎల్లమ్మ' మూవీ షూటింగ్‌ను ఈ ఏడాది చివరినాటికి ప్రారంభించాలని మేకర్స్ భావిస్తుంటే.. చివరి నిమిషంలో సాయి పల్లవి డేట్స్ కుదరడం లేదు అని ఈ సినిమాకు నో చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో మేకర్స్ మరో హీరోయిన్ కోసం వెతుకుతున్నారు. ఇంతకు ఎల్లమ్మ సినిమాలో కీలక పాత్రలో నటించే ఆ నటీమణి ఎవరో తేలాలంటే మరికొద్ది రోజులు వెయిట్ చేయాల్సిందే.

## ఆమె నా ఇంటి గేట్‌ను పెళ్లి చేసుకుంది.. సరదా విషయం పంచుకున్న రణ్‌బీర్



అభిమాన నటీనటుల కోసం ఫ్యాన్స్ చేసే పనులు ఒక్కోసారి భలే ఆకట్టుకుంటాయి. అలాగే హాస్యాస్పదంగానూ ఉంటాయి. హీరో రణ్‌బీర్ కోసం ఓ మహిళా అభిమాని చేసిన పనిని ఆయన తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఆమె.. తన మొదటి భార్య అని సరదాగా చెప్పారు.బాలీవుడ్ కథానాయకుడు రణ్‌బీర్ కపూర్‌కు ఉన్న ఫాలోయింగ్ తెలిసిందే. ఈ హీరోకు మహిళా అభిమానులూ ఎక్కువే. గతంలో ఓ మహిళా అభిమాని చేసిన పనిని రణ్‌బీర్ తాజాగా పంచుకున్నారు. రణ్‌బీర్ కెరీర్ ప్రారంభించిన తొలినాళ్లలో ఓ అభిమాని ఈ హీరో ఇంటి గేట్‌ను పెళ్లి చేసుకుందట. ''నేను ఓ క్రేజీ విషయం పంచుకోవాలనుకుంటున్నాను. ఓ అమ్మాయి నన్ను బాగా అభిమానించేది. నేను ఊర్లో లేని సమయంలో ఆ అమ్మాయి పురోహితుడిని తీసుకొచ్చి నా ఇంటి గేట్‌ను పెళ్లి చేసుకుందట. గేట్‌కు పువ్వులు, బొట్టు పెట్టింది. నేను ఊరి నుంచి వచ్చిన తర్వాత నా వాచ్‌మెన్ ఈ విషయం చెప్పాడు. దీంతో ఆశ్చర్యానికి గురయ్యాను. ఆమె నా మొదటి భార్య. తనను ఇప్పటివరకూ నేను కలవలేదు. ఆమెను కలిసే రోజు కోసం ఎదురుచూస్తున్నాను'' అని చెప్పారు. ఇక ఇదే ఇంటర్వ్యూలో రణ్‌బీర్ తన భార్య అలియా గురించి మాట్లాడారు. అలియా ఓ అద్భుతమన్నారు. అంతకంటే గొప్ప భాగస్వామి ఉండదన్నారు.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.